మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 7-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 189 Issue: 189

Published from Jagitial
www.evarthalu.com

07 జనవరి 2026 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:51 సూర్యాస్తమయం - సా. 5:52 తిథి చవితి ఉ. 6:52 వరకు తరువాత పంచమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం మఖ ఉ. 11:56 వరకు తరువాత పూర్వ ఫల్గుని(పుబ్బ) యోగం ఆయుష్మాన్ సా. 6:38 వరకు కరణం బాలవ ఉ. 6:52 వరకు కౌలవ సా. 6:43 వరకు వర్జ్యం రా. 8:05 నుండి రా. 9:43 వరకు దుర్ముహూర్తం మ. 12:00 నుండి మ. 12:44 వరకు రాహుకాలం మ. 12:22 నుండి మ. 1:45 వరకు యమగండం ఉ. 8:14 నుండి ఉ. 9:37 వరకు గుళికాకాలం ఉ. 10:59 నుండి మ. 12:22 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:15 నుండి ఉ. 6:03 వరకు అమృత ఘడియలు ఉ. 9:33 నుండి ఉ. 11:08 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "౦" అనగా మరుసటి రోజున




## ఎల్ఐసీ నుంచి జీవన్ ఉత్సవ్ ప్లాన్

ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ జీవన్ ఉత్సవ్ పేరిట సింగిల్ ప్రీమియం ప్లాన్‌ను ప్రకటించింది. జనవరి 12 నుంచి దీని విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు మంగళవారం సమాచారం ఇచ్చింది.

ముంబై: నాన్ పార్టిసిపేటింగ్, నాన్‌లింక్డ్, ఇండివిడ్యువల్, సేవింగ్స్, పూర్తి జీవితకాలానికి బీమా అందించే ప్లాన్ ఇది. ప్రీమియం, ఇతర వివరాలు వెల్లడించలేదు. జీవన్ ఉత్సవ్ పేరిట రెండేళ్ల క్రితం ఓ పాల సీని ఎల్ఐసీ తీసుకొచ్చింది. దానికే మార్పులు -2 వ పేజీలో...




## 8 శాతం వడ్డీతో అమెజాన్ ఎఫ్‌డీ

ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌కు చెందిన డిజిటల్ పేమెంట్స్ విభాగం అమెజాన్ పే, తన వినియోగదారుల కోసం ఓ కొత్త ఆర్థిక సేవను ప్రారంభించింది. ఇకపై అమెజాన్ పే యాప్ ద్వారానే ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) చేసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ ఎఫ్‌డీలపై వార్షికంగా 8 శాతం వరకు వడ్డీని అందిస్తున్నట్లు ప్రకటించింది.

ముంబై: ఈ సేవ కోసం శివాలిక్, సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, శ్రీరామ్ ఫైనాన్స్ వంటి పలు బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో అమెజాన్ పే భాగస్వామ్యం కుదుర్చుకుంది. వినియోగదారులు కేవలం రూ.1,000 కనీస పెట్టుబడితో ఎఫ్‌డీని ప్రారంభించవచ్చు. ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన తరువాయి 2 వ పేజీలో...




## వచ్చే ఏడాది జీడీపీ 6.9 శాతం

ఆర్థికవ్యవస్థ మెరుగైన వృద్ధిని కొనసాగిస్తుందని ప్రముఖ రేటింగ్ సంస్థ ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్ (ఇండ్-రా) అభిప్రాయపడింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ వృద్ధి 6.9 శాతం వృద్ధిని సాధిస్తుందని అంచనా వేసింది. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది.

ముంబై: ప్రధానంగా జీఎస్టీ తగ్గింపులతో పాటు ఆదాయపు పన్ను కోత వంటి కీలక సంస్కరణలు, వాణిజ్య ఒప్పందాలు దోహదపడతాయని, ఈ అంశాలు ప్రపంచ అనిశ్చితి నుంచి ఆర్థికవ్యవస్థను రక్షిస్తాయని ఇండ్-రా అభిప్రాయపడింది. దేశ ఆర్థికవ్యవస్థ వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ అధిక వృద్ధిని తరువాయి 2 వ పేజీలో...

# జిల్లాలను మార్చేస్తాం

### పునర్వ్యవస్థీకరణ చేపడతాం.. గత ప్రభుత్వంలో అశాస్త్రీయ విభజన

### 3-4 జిల్లాల్లో కొన్ని మండలాలు.. అసెంబ్లీలో మంత్రి పొంగులేటి వెల్లడి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవలే జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టగా, తెలంగాణ ప్రభుత్వం సైతం జిల్లాల పునర్ వ్యవస్థీకరణ దిశగా అడుగులేస్తోంది. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ విషయాన్ని స్పష్టం చేశారు చేశారు. మంగళవారం అసెంబ్లీ వేదికగా జరిగిన చర్చలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజన శాస్త్రీయంగా లేదని.. దీనివల్ల పరిపాలనలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన తెలిపారు.




హైదరాబాద్, జనవరి 6 (ఈవార్తలు): శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, వీరేశం, హరీష్ తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. గత పాలనలో మండలాల ఏర్పాటు నుంచి జిల్లాల పునర్వ్యవస్థీకరణ వరకు ప్రజల విజ్ఞప్తులను, భౌగోళిక పరిస్థితులను పట్టించుకోకుండా నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించారు. దీనివల్ల ఒకే నియోజకవర్గంలోని మండలాలు వేర్వేరు జిల్లాల పరిధిలోకి వెళ్లాయని.. ఫలితంగా ప్రజలు ప్రభుత్వ పనుల కోసం వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అంతే కాదు.. జిల్లాల విభజనలో శాస్త్రీయత కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని మంత్రి ఆరోపించారు. కేవలం అదృష్ట తరువాయి 2 వ పేజీలో...



# సర్కారోళ్లకు రూ.కోటి బీమా

### త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అమలు.. అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి ప్రకటన

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ. 1 కోటి విలువైన ప్రమాద బీమా కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మంగళవారం శాసనసభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు.

హైదరాబాద్, జనవరి 6 (ఈవార్తలు): ప్రస్తుతం సింగరేణి, విద్యుత్ శాఖ కార్మికులతో ప్రారంభమైన ఈ భారీ బీమా పథకాన్ని.. భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని విభాగాలకు వర్తింపజేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగి భద్రతా హక్కును కాపాడటమే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సింగరేణి కార్మికులకు, డిస్కమ్స్‌లో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులకు ఈ రూ. 1 కోటి ప్రమాద బీమా సౌకర్యాన్ని తరువాయి 2 వ పేజీలో...

## ఈవీ కొంటే 20% డిస్కౌంట్

### ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం ఆఫర్

### అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రకటన



హైదరాబాద్, జనవరి 6 (ఈవార్తలు): రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఈవీ వాహనాల కొనుగోలుపై ప్రత్యేక రాయితీలు కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఈవీ పాలసీలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసే ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం డిస్కౌంట్ ఇవ్వాలని తయారీ కంపెనీలను ప్రభుత్వం కోరిందన్నారు. ఇది ఉద్యోగులకు ఆర్థికంగా భారీ ఊరటనిచ్చే - 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,822 |
| వెండి (గ్రాము): | రూ.271 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,340 |

## విశ్వవాణి



జపాన్‌కు చెందిన 'క్నోట్' టెక్ కంపెనీ.. ఆఫీస్‌లలో పిల్లులను ఉంచుతోంది. ఆ పిల్లుల వల్ల ఉద్యోగుల్లో ఒత్తిడి తగ్గుతోందట. వాటితో ఆడుకోవడం వల్ల పని ఒత్తిడి నుంచి రిలీఫ్ రిలీఫ్ కలుగుతోందట. దీంతో కంపెనీ మొత్తం 11 పిల్లులను పెంచుతోందట.

# అలుగుడు.. గులుగుడు ఇంట్లోనే!

### ఏదైనా ఉంటే ఇంట్లో కొట్లాడాలి

### కుటుంబం అన్నాక సమస్యలు కామన్

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



కుటుంబం అన్నాక సమస్యలు ఉండటం సహజమని, అక్కడక్కడ అలుగుడు, గులుగుడు లేకపోతే అది అసలు కుటుంబమే కాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కవిత శాసనమండలిలో కన్నీటి ప్రకటన తర్వాత మంగళవారం జనగామలో నిర్వహించిన సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా పరోక్షంగా కీలక వ్యాఖ్యలు చేశారు. కుటుంబం అన్నాక సమస్యలు ఉంటాయి. అక్కడక్కడ అలుగుడు, గులుగుడు ఉంటది. లేకుంటే కుటుంబమే కాదు. ఏదైనా ఉంటే ఇంట్లో అనుకోవాలి, కలిసి కొట్లాడాలన్నారు.

హైదరాబాద్, జనవరి 6 (ఈవార్తలు): కవిత కుటుంబంతో బంధం తెంచుకుంటున్నానని రాజకీయ శక్తిగా మారి తిరిగి వస్తానని ప్రకటించిన సందర్భంలో కేటీఆర్ వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. జనగామ పట్టణంలోని భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల అభినందన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ తరువాయి 2 వ పేజీలో...



# కవిత రాజీనామా ఆమోదం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాజీనామాకు ఆమోదం లభించింది. తాజాగా ఆమె రాజీనామాను శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆమోదించారు. కవిత రాజీనామా ఆమోదంపై లెజిస్లేటివ్ సెక్రటరీ నోటిఫికేషన్ జారీ చేశారు.

హైదరాబాద్, జనవరి 6 (ఈవార్తలు): కాగా.. గతేడాది సెప్టెంబర్ 3న తన ఎమ్మెల్సీ సభ్యత్వానికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. నిజామాబాద్ స్థానిక సంస్థల స్థానం నుంచి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2021లో నిజామాబాద్ స్థానం నుంచి శాసన మండలి సభ్యులుగా విజయం సాధించారు. కాగా.. బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి సెప్టెంబర్ 3న రాజీనామా చేశారు. అంతేకాకుండా సోమవారం తన రాజీనామాను ఆమోదించాలని విజ్ఞప్తి శాసనమండలి ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో మండలి ఛైర్మన్ తాజాగా కవితి రాజీనామాను ఆమోదించారు.

# ఆదివారం కొత్త బడ్జెట్!

### జనవరి 31 నుంచి బడ్జెట్ సమావేశాలు

### ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర పద్దు

### ప్రవేశపెట్టనున్న కేంద్ర మంత్రి నిర్మల




న్యూఢిల్లీ: భారత పార్లమెంటరీ చరిత్రలో తొలిసారి ఒక విశేషం నమోదు కాబోతుంది. ఇప్పటికే 8 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఏకైక ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ నిలిచిన క్రమంలో.. మరో అరుదైన రికార్డ్ కు ఆమె సిద్ధమయ్యారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఆమె 9వ సారి పద్దును ప్రవేశ తరువాయి 2 వ పేజీలో...

# పొంగల్ ఏంది వయ్యా.. సంక్రాంతి అనొచ్చుగా!

### ప్రభుత్వ ఉత్తర్వులపై తెలుగు ప్రజల మండిపాటు

హైదరాబాద్, జనవరి 6 (ఈవార్తలు): సంక్రాంతి పండుగకు ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు వివాదాస్పదం అయ్యాయి. కారణం ఏంటంటే.. సంక్రాంతి అని కాకుండా, పొంగల్ అని అందులో ఉండటమే. మనం మన సంక్రాంతి పండుగను 'సంక్రాంతి' అని పిలుచుకోవచ్చు కదా.. 'పొంగల్' అని సంబోధించుకోవడం ఏంటి? అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకెళితే.. సంక్రాంతి సెలవులు ఈ నెల 10 నుంచి 16 వరకు ఉంటాయని, 17 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం -2 వ పేజీలో...


PROCEEDINGS OF THE DIRECTOR, SCHOOL EDUCATION
TELANGANA, HYD
Present: Dr. E. Naveen Nicolas, IAS.

Rc. No. 615/2/C&T/SCERT/TG/2024 Date: 05.01.2026

Sub: SCERT, Telangana, Hyderabad – Pongal holidays from 10.01.2026 to 16.01.2026 - Orders issued – Reg.

Ref: 1) Memo No. 3663/SE Prog II/A1/2025 dated 06.06.2025 of the Government of Telangana, School Education Department (Academic Calendar 2025-26).
2) G.O. Rt. No. 1715 dated 06.12.2025 of General Administration (SPL.E) Department (General Holidays & Optional Holidays for the year 2026).

* * * * *

As per reference 2nd cited, the Pongal festival is observed on 15.01.2026, and 16.01.2026 (Kanuma) is an Optional Holiday as per the list of holidays declared by the GAD, Government of Telangana.

As 16.01.2026 immediately follows the festival, it is decided to extend the Pongal holidays up to 16.01.2026 as per the reference 2nd cited and accordingly, all the schools under all managements shall re-open on 17.01.2026.

Therefore RJDSE Hyderabad, Warangal and all the District Educational officers are requested to take necessary action accordingly.

Director, School Education
Telangana, Hyderabad

To
All the District Educational Officers in the State for necessary action The RJDSEs of Hyderabad & Warangal for necessary action
Copy to ASPD, Samagra Shiksha, TG, Hyderabad for necessary action
Copy to Director, SCERT, TG, Hyderabad for necessary action



# సోనియాకు అస్వస్థత ఆస్పత్రిలో చేరిక

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అస్వస్థతకు గురైనట్టుగా తెలిసింది. ఆమెను ఢిల్లీలోని సర్ గంగా రామ్ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం సోనియా గాంధీ పరిస్థితి బాగానే ఉందని, తీవ్రమైన దగ్గుతో బాధపడుతున్న కారణంగా ఆమెను ఆస్పత్రిలో తరువాయి 2 వ పేజీలో...

ఈవార్తలు



## రాశి ఫలాలు

7.1.2026

మేషం: వృత్తి ఉద్యోగాలలో మరింత పురో గతి కలుగుతుంది. నూతన విషయాలు తెలుసుకుంటారు. ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది. ఇంటా బయట మీ శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. వ్యాపారాలు ఆశించిన రీతిలో లాభాలు అందుకుంటారు.

వృషభం: శుభకార్యాలు నిర్వహిస్తారు. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. వృత్తి వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. స్థిరాస్థి వృద్ధి చెందుతుంది ప్రముఖుల నుండి ఊహించని ఆహ్వానాలు అందుతాయి.

మిధునం: వృత్తి వ్యాపారాలు చికాకుగా ఉంటాయి. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో ఆసక్తి పెరుగుతుంది. ఆదాయానికి మించిన ఖర్చులు పెరుగుతాయి. బంధువులతో అకారణంగా మాటపట్టింపులు కలు గుతాయి.

కర్కాటకం: ఆరోగ్య విషయాల్లో శ్రద్ధ వహించాలి. ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉండదు. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు ఉంటాయి. దూర ప్రయాణాలు చేయవలసి రావచ్చు. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు ఏర్పడతాయి.

సింహం: వ్యాపారాలు సంతృప్తి కలిగిస్తాయి. సంతానానికి నూతన విద్యావకాశాలు లభిస్తాయి. ఉద్యో గస్తులకు పని ఒత్తిడి తొలగుతుంది. చిన్ననాటి మిత్రుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. కుటుంబ సభ్యులతో ఆలయ దర్శనాలు చేసుకుంటారు. ఉద్యోగాలలో ఇతరులతో సమస్యలు కలుగుతాయి. చేపట్టిన పనులలో అవాంతరాలు కలు గుతాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సా గుతాయి.

తుల: ఉద్యోగస్తులకు ఉన్నత అవకాశాలు పొందుతారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. చేపట్టిన వ్యవహారాలలో ఆకస్మిక విజయం లభిస్తుంది. కొన్ని పనులలో ఆప్తులు సలహాలు తీసుకోవడం మంచిది.

వృశ్చికం: సమయానికి నిద్రాహారాలు ఉండవు. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలు ఆర్థిక నష్టాలు కలుగుతాయి. ఉద్యోగస్తుల పనికి తగిన గుర్తింపు లభించక విమర్శలు ఎదురవుతాయి. చేపట్టిన పనులు సమయానికి పూర్తి కాక చికాకులు పెరు గుతాయి.

ధనస్సు: బంధు మిత్రుల ఆదరణ కలుగుతుంది. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో మరింత ఉత్సాహంగా పని చేసి లాభాలు అనుకుంటారు. ఆర్థికంగా ఒడిదుడుకులు తొలగి స్థిరత్వం కలు గుతుంది. గృహమున వివాహాది శుభకార్య ప్రయత్నాలు చేస్తారు.

మకరం: ప్రయాణాలలో నూతన పరిచయాలు భవిష్యత్తులో ఉపయోగపడే విధంగా ఉంటాయి. ఊహించని విధంగా పనులు పూర్తి చేస్తారు. వ్యాపార ఉద్యోగాలలో సమస్యలను అధిగమించి ధైర్యంగా ముందుకు సాగుతారు. సోదరులతో స్థిరాస్థి వివాదాలు పరిష్కార దిశగా సా గుతాయి.

కుంభం: చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తికాక శ్రమాధిక్యత కలుగుతుంది. బంధువులు మీ మాటతో విభేదిస్తారు ఆలోచనలలో స్థిరత్వం ఉండదు. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారాలలో భాగస్తులు తో చిన్నపాటి సమస్యలు కలు గుతాయి.

మీనం: నూతన వ్యాపారాలు ఒడిదుడుకులుగా ఉంటాయి. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. వృత్తి ఉద్యోగాలలో కొందరి ప్రవర్తన బాధ కలిగిస్తుంది. కుటుంబ సభ్యులతో విభేదాలు కలుగుతాయి. చేపట్టిన పనులు మరింత మందకొడిగా సా గుతాయి.

# జిల్లాలను మార్చేస్తాం

మొదటి పేజీ తరువాయి

సంఖ్యల ఆధారంగా.. తమను ప్రసన్నం చేసుకున్న వారికి అనుకూలంగా విభజన ప్రక్రియ సాగిందని పేర్కొన్నారు. ప్రజల సౌలభ్యం కంటే పాలకుల వ్యక్తిగత ఇష్టాలే ప్రామాణికంగా మారడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ డివిజన్లు, మండలాల మధ్య సమన్వయం లోపించిందని వివరించారు. ఈ లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని.. రాష్ట్రాన్ని మరోసారి క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రివర్గ సమావేశంలో దీనిపై లోతుగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జిల్లాల వారీగా ఉన్న ఇబ్బందులపై అధికారుల నుంచి ప్రభుత్వం ప్రత్యేక నివేదికలను కోరిందన్నారు. నివేదిక వచ్చిన తర్వాత శాసనసభలో సభ్యులందరి అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే మార్పులు చేపడుతామని పేర్కొన్నారు. పరిపాలన వికేంద్రీకరణ లక్ష్యం నెరవేరాలంటే ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ కార్యాలయాలు ఉండాలని.. ఆ దిశగానే మండలాల ఏర్పాటు ఉంటుందని హామీ ఇచ్చారు. ఇప్పటివరగా.. ఎటువంటి స్వార్థ ప్రయోజనాలు లేకుండా .. కేవలం ప్రజల అవసరాల కోసం మాత్రమే రాబోయే కాలంలో జిల్లాల, మండలాల పునర్వ్యవస్థీకరణ జరుగుతుందని పేర్కొన్నారు.



# సర్కారోళ్లకు కోటి బీమా



అమలు చేస్తున్నట్లు తెలిపారు. అయితే.. దీనిని కేవలం రెండు శాఖలకే పరిమితం చేయకుండా.. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు కూడా భవిష్యత్తులో వర్తింపజేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన ప్రకటించారు. బ్యాంకుల ద్వారానే ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం వల్ల ప్రభుత్వం లేదా ఆయా సంస్థలపై అదనపు ఆర్థిక భారం పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. కేవలం బీమా మాత్రమే కాకుండా .. కార్మికుల ఆరోగ్య సంరక్షణపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సింగరేణి ఏరియా ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సింగ్, ఇతర సిబ్బంది పోస్టులను రాబోయే మార్చి నెల నాటికి పూర్తిగా భర్తీ చేస్తామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. అంతేకాకుండా.. సింగరేణి కార్మికుల కోసం గోదావరిఖనిలో అత్యంత ఆధునికమైన 'క్యాత్ ల్యాబ్' ను మరో 75 రోజుల్లోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇది గుండె సంబంధిత సమస్యలతో బాధపడే కార్మికులకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. ఏళ్ల తరబడి సింగరేణి కోసం శ్రమించిన విశ్రాంత ఉద్యోగుల సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం విస్మరించలేదని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇళ్ల నిర్మాణం కోసం స్థలాల కేటాయింపు, గృహ వసతి కల్పన వంటి అంశాలపై సింగరేణి బోర్డుతో చర్చించి త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే.. 2047 నాటికి తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టే లక్ష్యంతో రూపొందించిన తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆయన సభలో ప్రవేశపెట్టారు.

## ఈవీ కొంటే 20% డిస్కౌంట్

మొదటి పేజీ తరువాయి

అంశమని చెప్పారు. కేవలం ఉద్యోగులకే కాకుండా, ప్రభుత్వ విభాగాల్లో కూడా 25 నుంచి 50 శాతం వరకు ఈవీ వాహనాలనే వినియోగించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. ఇదే నిబంధనను ఎంఎన్‌సీ కంపెనీలు, ప్రైవేటు పాఠశాలలకు కూడా వర్తింపజేసేలా 'నిర్బంధ విధానం' తీసుకువచ్చే యోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. ప్రజా రవాణాలో కాలుష్యాన్ని తగ్గించేందుకు 'పీఎం ఈ-డ్రైవ్' పథకం కింద ప్రస్తుతం 575 ఆర్టీసీ బస్సులు నడుస్తుండగా.. త్వరలోనే కొత్తగా 2,800 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. వీటితో పాటు వరంగల్ మున్సిపాలిటీకి 100, నిజామాబాద్‌కు 50 బస్సులు కేంద్ర పథకం ద్వారా రానున్నాయన్నారు. రాష్ట్రంలో కొత్త ఈవీ పాలసీ అమలులోకి వచ్చిన ఏడాది కాలంలోనే దాదాపు లక్ష వాహనాలు అమ్ముడుపోవడం విశేషమని తెలిపారు. వాహనదారుల సౌకర్యార్థం ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్యను భారీగా పెంచుతున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గేటెడ్ కమ్యూనిటీలలో చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బ్యాటరీ సామర్థ్యాన్ని పెంచేలా కంపెనీలతో సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించారు. ఈవీ వాహనాలపై ఇస్తున్న రాయితీల వల్ల ప్రభుత్వానికి సుమారు రూ. 900 కోట్ల పన్ను ఆదాయం తగ్గినప్పటికీ.. భవిష్యత్తు తరాల కోసం ఈ పాలసీని పకడ్బందీగా అమలు చేస్తున్నామని ప్రభుత్వం స్పష్టం చేసిందని, కాలుష్య నియంత్రణలో భాగంగా 15 ఏళ్లు దాటిన పాత వాహనాలను తొలగించేందుకు 'స్క్రాప్ పాలసీ'కి ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. హైదరాబాద్ నగరంలో కాలుష్యాన్ని అరికట్టేందుకు పాత పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే 'రెట్రో ఫిట్టింగ్' ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాల్లో ఈవీ వాహనాలను వాడాలని మంత్రి కోరారు.

## .. సంక్రాంతి అనొచ్చుగా!

మొదటి పేజీ తరువాయి

అవుతాయని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. అందులో సంక్రాంతికి బదులుగా పొంగల్ అని పేర్కొంది. దీనిపై సోషల్ మీడియాలో తెలుగు నెటిజన్లు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ముఖ్యమైన పండుగను సంక్రాంతి అని పిలుస్తారని, పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో వాడే పొంగల్ పదాన్ని వాడటం ఏంటని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. తెలుగు ప్రజలు జరుపుకునేది సంక్రాంతి అని, పొంగల్ కాదు అంటూ ప్రభుత్వ తీరును ఎండగడుతున్నారు. మన భాష, మన సంస్కృతిపై ప్రభుత్వానికి అవగాహన లేదా? అని నిలదీస్తున్నారు.

## ఆదివారం కొత్త బడ్జెట్!

మొదటి పేజీ తరువాయి

పెట్టబోతున్నారు. అది కూడా ఆదివారం నాడు ఈ సారి బడ్జెట్ ఉభయ సభల ముందుకు రానుంది. 2026-27ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సాధారణ బడ్జెట్‌ను పార్లమెంటరీ సంప్రదాయాల ప్రకారం ఫిబ్రవరి 1నే ప్రవేశపెట్టబోతున్నారు. 2017 నుంచి ఈ సంప్రదాయం ప్రారంభమైంది. సాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టే తేదీలో పెద్ద మార్పును 2017 లో చేశారు. అంతకు, సాధారణ బడ్జెట్ ఫిబ్రవరి చివరి రోజున ప్రవేశపెట్టేవాళ్లు. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం నుంచి వచ్చే నిధులను అంచనా వేసి ఆయా రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశ పెట్టడానికి ఆలస్యమవుతుంది కేంద్రం భావించి తేదిని మార్చింది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన మొదటి మూడు నెలల ఖర్చులకు ప్రభుత్వం అనుమతి పొందేది. అయితే, మొత్తం సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌కు తర్వాత ఆమోదం లభించేది. 2017 నుంచి నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే సంప్రదాయాన్ని ప్రారంభించారు. దీంతో మార్చి చివరి నాటికి బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం పొందేది. ఈ సారి కూడా పార్లమెంట్ లో బడ్జెట్ ఫిబ్రవరి 1నే ఉభయ సభల ముందుకు రానుంది. బడ్జెట్ సమావేశాలకు సంబంధించి అధికారిక షెడ్యూల్ విడుదలైంది. పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశమై దీనిపై తుది నిర్ణయం తీసుకుంది. జనవరి 31న బడ్జెట్ సమావేశాలు ప్రారంభ కాబోతున్నాయి. అదే రోజు రాష్ట్రపతి ప్రసంగం ఉంటుంది. అనంతరం ఫిబ్రవరి 1న లోక్ సభ, రాజ్య సభల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 సంవత్సరానికి సంబంధించి వార్షిక పద్దును ప్రవేశపెడతారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఈ సారి తన తొమ్మిదో బడ్జెట్‌ను సమర్పించబోతున్నారు. ఇది దేశ చరిత్రలో ఓ కీలక మైలురాయి. అయితే ఆదివారం సెలవు దినం కావడంతో పాటు ఆ రోజున గురు రవిదాస్ జయంతి కూడా ఉండటంతో తేదీ మార్పుపై ఊహాగానాలు నెలకొన్నాయి. వాటిని ఖండిస్తూ.. అధికారిక ప్రకటన విడుదలైంది. భారత పార్లమెంటరీ చరిత్రలో బడ్జెట్‌ను గతంలో శనివారాల్లో ప్రవేశపెట్టిన సందర్భాలు ఉన్నాయి 2020లో, 2025 లో శనివారం పద్దును ప్రవేశపెట్టారు. కానీ ఆదివారం నాడు బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇప్పటి వరకు జరగలేదు. దేశ చరిత్రలో తొలిసారి ఆదివారం బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారు.

## వచ్చే ఏడాది జీడీపీ 6.9 శాతం

మొదటి పేజీ తరువాయి

కొనసాగించగలదని, రిటైల్ ద్రవ్యోల్బణం సైతం సగటున 3.8 శాతం నమోదు అవ్వొచ్చని ఇండ్-రా అభిప్రాయపడింది. భారత్-యూఎస్ వాణిజ్య ఒప్పందం కూడా అధిక జీడీపీ వృద్ధికి తోడ్పడుతుందని ఇండ్-రా ప్రధాన ఆర్థికవేత్త దేవేంద్ర కుమార్ పంత్ అన్నారు. ఇదే సమయంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దేశ వాస్తవ జీడీపీ వృద్ధిని 7.4 శాతంగా, నామమాత్రపు జీడీపీని 9 శాతంగా ఇండ్-రా అంచనా వేసింది. అలాగే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత కరెన్సీ రూపాయి విలువ సగటున డాలర్‌కు రూ. 88.64గా ఉంది. కానీ, 2026-27లో ఇది సగటు డాలర్‌కు రూ. 92.26కి చేరుకోవచ్చని పేర్కొంది.

## 8 శాతం వడ్డీతో అమెజాన్ ఎఫ్‌డీ

మొదటి పేజీ తరువాయి

అవసరం లేకుండా, పూర్తిగా డిజిటల్ పద్ధతిలో వివిధ బ్యాంకుల వడ్డీ రేట్లను పోల్చి చూసుకుని నచ్చినదాన్ని ఎంచుకోవచ్చు. దీనికోసం ప్రత్యేకంగా సేవింగ్స్ ఖాతా తెరవాల్సిన అవసరం లేదు. శ్రీరామ్ ఫైనాన్స్‌లో మహిళా ఇన్వెస్టర్లకు 0.5 శాతం అదనపు వడ్డీ లభించనుండగా, సీనియర్ సిటిజన్లకు అన్ని భాగస్వామ్య సంస్థల నుంచి అదనపు వడ్డీ ప్రయోజనం ఉంటుంది. బ్యాంకుల్లో చేసే ఎఫ్‌డీలకు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ నుంచి రూ.5 లక్షల వరకు బీమా హామీ ఉంటుందని కంపెనీ స్పష్టం చేసింది. భారత్‌లో ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలకు మంచి ఆదరణ ఉందని, ఈ కొత్త సేవ ద్వారా వినియోగదారులకు మెరుగైన రాబడి, మరిన్ని ఎంపికలు అందిస్తున్నామని అమెజాన్ పే సీఈఓ వికాస్ బన్సాల్ తెలిపారు.

## ఎల్ఐసీ నుంచి జీవన్ ఉత్సవ్ ప్లాన్

మొదటి పేజీ తరువాయి

చేసి సింగిల్ ప్రీమియంగా తీసుకొచ్చే అవకాశం ఉంది. ఒకసారి పాలసీని కొనుగోలు చేస్తే జీవితాంతం ఆదాయం పొందవచ్చు. మరోవైపు కాలం చెల్లిన పాలసీలను పునరుద్ధరించుకునే అవకాశం కల్పిస్తూ ప్రత్యేక పునరుద్ధరణ కార్యక్రమాన్ని ఎల్ఐసీ చేపట్టింది. ప్రీమియం చెల్లింపుల గడువు దాటి, కాలవ్యవధి పూర్తికాని పాలసీలను ఈ కార్యక్రమంలో భాగంగా పునరుద్ధరించుకోవచ్చు. జనవరి 1 నుంచి మార్చి 2 వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. ఇందులో భాగంగా ఆలస్య రుసుము విషయంలోనూ రాయితీ ఇస్తున్నట్లు ఎల్ఐసీ ప్రకటించింది. నాన్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లపై గరిష్ఠంగా 30 శాతం (రూ.5వేల వరకు), మైక్రో ఇన్సూరెన్స్ ప్లాన్లపై నూరు శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపింది. ప్రీమియం చెల్లింపులు నిలిచిపోయి ఐదేళ్లు లేదా అంతకంటే తక్కువ సమయం ఉన్న పాలసీలను మాత్రమే పునరుద్ధరించుకోవచ్చు.

## సోనియాకు అస్వస్థత ఆస్పత్రిలో చేరిక

మొదటి పేజీ తరువాయి

చేర్పించాల్సి వచ్చిందని సమాచారం. ప్రస్తుతం సోనియా పరిస్థితి నిలకడగానే ఉందని చెప్పారు. సీనియర్ పల్మనాలజిస్ట్ పర్యవేక్షణలో సోనియాగాంధీకి వైద్యం అందిస్తున్నారు. నివేదికల ప్రకారం, సోనియా గాంధీ గత కొద్ది రోజులుగా తీవ్రమైన దగ్గుతో బాధపడుతున్నారు. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీ నగరంలో కాలుష్యం కారణంగా అప్పుడప్పుడు చెకప్‌ల కోసం ఆస్పత్రికి వెళ్తుంటారని తెలిసింది. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం సోనియా గాంధీ ఆసుపత్రిలో చేరినట్లు వర్గాలు తెలిపాయి.

# అలుగుడు.. గులుగుడు ఇంట్లోనే!

మొదటి పేజీ తరువాయి

ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డికి తెలంగాణ భూగోళంపై కానీ, నదులపై కానీ కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. గోదావరి ఎక్కడుందో తెలియని వ్యక్తి కేసీఆర్ గారికి పాఠాలు చెబుతున్నారని, అసలు సంబంధం లేని భాక్రా నంగల్ ప్రాజెక్టు తెలంగాణలో ఉందని చెప్పడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని మండిపడ్డారు. పాలన అంటే మూటలు మోయడం కాదు, ప్రజల కష్టాలు తీర్చడం అని వ్యాఖ్యానిస్తూ, రేవంత్ రెడ్డికి తెలివి తక్కువ మాటలు తప్ప అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని కేటీఆర్ ఆరోపించారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ చెప్పిన రూ.15,000 రైతుబంధు, రూ.500 బోనస్, కౌలు రైతులకు సాయం వంటివి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. నాడు నిరుద్యోగులను రెచ్చగొట్టి ఓట్లు వేయించుకున్న రాహుల్ గాంధీ, ఇప్పుడు ఉద్యోగాల ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500



ఇస్తామని చెప్పి మోసం చేశారని, తులం బంగారం దేవుడెరుగు.. కనీసం బతుకమ్మ చీరలు కూడా పెట్టలేని దౌర్భాగ్య స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు పుస్తెల తాడు తాకట్టు పెట్టే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణను సాధించిన మొనగాడు కేసీఆర్ అని, ఆయన చెప్పు ధూళికి కూడా రేవంత్ రెడ్డి సరిపోడని కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. తన చదువుపై రేవంత్ రెడ్డి ఎందుకు ఏడుస్తున్నారో అర్థం కావడం లేదని, తల్లిదండ్రులు చదువుకోమని పంపిస్తే రేవంత్ రెడ్డి లంగా పనులు చేస్తూ పెయింటింగులు వేసుకున్నారని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ ఒక ప్రెస్ మీట్ పెడితేనే రేవంత్ రెడ్డి ఆగమాగం అవుతున్నారని, ఒకవేళ కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ రెడ్డి గుండె ఆగి చనిపోతారేమోనని వ్యంగ్యంగా అన్నారు. తన సొంత సెక్యూరిటీ సిబ్బందిని ప్రజల ముందే కొడుతున్న రేవంత్ తీరును చూస్తుంటే ఆయనకు పిచ్చి పట్టినట్లు ఉందని, ఆయన్ని కట్టివేయాలని రేవంత్ భార్య గీతకు సూచించామని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ వేధింపులను, బెదిరింపులను తట్టుకొని నిలబడి సర్పంచులుగా గెలిచిన బీఆర్ఎస్ కార్యకర్తలకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. జనగామ ర్యాలీ చూస్తుంటే కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి అయ్యారనిపిస్తోంది అని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు మళ్ళీ గులాబీ జెండా వైపు చూస్తున్నారని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఇదే ఉత్సాహంతో పనిచేసి సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

పదవుల కోసం పార్టీ మారిన కడియం శ్రీహరి వంటి వారిని ప్రజలే బుద్ధి చెబుతారని, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య వంటి వీరులు పుట్టిన ఈ గడ్డపై అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం సాగిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.



# దేశ నిర్మాణానికి సలహాలివ్వండి

## ప్రధాని మోదీతో ఆలోచనలు పంచుకోండి

## తెలంగాణ యువజన బృందానికి గవర్నర్ సూచన

హైదరాబాద్, జనవరి 6 (ఈవార్తలు): దేశ నిర్మాణం కోసం తమ ఆలోచనలను ప్రధాని మోదీతో పంచుకోవాలని తెలంగాణ యువజన బృందానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సూచించారు. ఈ నెల 9 నుంచి 12 ఢిల్లీలో జరగనున్న 29వ జాతీయ యువజన ఉత్సవం (ఎన్‌వైఎఫ్)-2026లో తెలంగాణ రాష్ట్ర యువజన బృందం పాల్గొననుంది. ఈ నేపథ్యంలో ఎంపికైన యువజన ప్రతినిధులను తెలంగాణ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ సమన్వయంతో మై భారత్ తెలంగాణ.. మంగళవారం లోక్‌భవన్‌లో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. దేశ నిర్మాణంలో పాలుపంచుకోవాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో ప్రధానికి తమ సలహాలు ఇవ్వాలని చెప్తూ, శుభాకాంక్షలు తెలిపారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీవైఎల్‌డీ) 2026 కు ముందస్తు కార్యక్రమంగా కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఎన్‌వైఎఫ్‌ను నిర్వహిస్తోంది. ఈ ఉత్సవంలో తెలంగాణ నుంచి మొత్తం 68 మంది యువజన ప్రతినిధులు ఎంపికయ్యారు. వీరిలో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ విభాగంలో 45 మంది.. సాంస్కృతిక విభాగంలో 23 మంది ప్రతినిధులు ఉన్నారు. దేశవ్యాప్తంగా వచ్చే 3,000 మందికి పైగా యువతతో కలిసి వీరు ఈ ఉత్సవంలో పాల్గొంటారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో వికసిత్ భారత్ 2047 నిర్మాణానికి సంబంధించిన వినూత్న ఆలోచనలను పంచుకుంటారు. యువజన ప్రతినిధులకు 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీవైఎల్‌డీ) 2026' లక్ష్యాలు, ప్రాముఖ్యతను తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్‌ఏటీజీ) ఉపాధ్యక్షుడు- కార్యనిర్వహక డైరెక్టర్, యువజన సర్వీసుల కమిషనర్ (ఇన్‌ఛార్జ్) డాక్టర్ ఏ సోనీబాల దేవి (ఏఎఫ్ఎశ్) వివరించారు. కార్యక్రమంలో సెట్విన్ కార్యనిర్వహక డైరెక్టర్ కే వేణుగోపాల్ రావు, మై భారత్ అసిస్టెంట్ డైరెక్టర్ జీ రాజేశ్, హైదరాబాద్ జిల్లా యువజన అధికారి ఖుష్బూ గుప్త, రంగారెడ్డి జిల్లా యువజన అధికారి టీ ఇషయా, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 'జీ రామ్ జీ'తో కనీస వేతనాలకు రక్ష

**ఎన్ఐఆర్‌డీపీఆర్ డీజీ డాక్టర్ నరేంద్ర కుమార్**

**కొత్త ఉపాధి చట్టంతో మెరుగైన ఫలితాలు**

**ఎన్ఐఆర్‌డీపీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిస్ సత్యపాలన్**

**పీఐబీ ఆధ్వర్యంలో వార్తాలాప్ వర్క్‌షాప్ నిర్వహణ**




హైదరాబాద్, జనవరి 6 (పీఐబీ): వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్(గ్రామీణ) చట్టంతో కనీస వేతనాలకు రక్షణ లభిస్తుందని జాతీయ గ్రామీణాభివృద్ధి- పంచాయతీ రాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డీపీఆర్) డైరెక్టర్ జనరల్, ఐఏఎస్ డాక్టర్ జీ నరేంద్ర కుమార్ అన్నారు. జీ రామ్ జీ చట్టంపై అసత్య సమాచారాన్ని అరికట్టే లక్ష్యంగా పీఐబీ-హైదరాబాద్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఐసీఏఆర్- జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థలో మంగళవారం వార్తాలాప్ మీడియా వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్త ఉపాధి చట్టంపై పాత్రికేయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ.. 'వికసిత భారత్'గా ఎదగాలన్న దేశ ఆకాంక్షలకు అనుగుణంగా.. 2047 నాటికి ఆ లక్ష్యాన్ని చేరుకునేలా ఓ స్పష్టమైన ప్రణాళికను వీబీ- జీ రామ్ జీ చట్టం అందిస్తుందన్నారు. 'జాతీయ అభివృద్ధి ప్రాధాన్యాలతో గ్రామ పంచాయతీలను అనుసంధానించడం ద్వారా.. ఉపాధి కల్పనలోనూ, సుస్థిర - సమ్మిళిత గ్రామీణాభివృద్ధిలోనూ వీబీ- జీ రామ్ జీ చట్టం కీలక పాత్ర పోషిస్తుంది' అని అన్నారు. కనీస వేతనాలు తగ్గుతాయన్న ఆందోళనలను డాక్టర్ నరేంద్ర కుమార్ తోసిపుచ్చారు. కొత్త చట్టం కింద కనీస వేతనాలకు పూర్తి స్థాయి రక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. గ్రామీణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, గ్రామ స్థాయిలో ప్రాథమిక సదుపాయాలను అందించడం వీబీ- జీ రామ్ జీ చట్టం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో జీవన నాణ్యత గణనీయంగా మెరుగుపడుతుందన్నారు. సంస్థాగత సంస్కరణలను ప్రస్తావిస్తూ, మూడు అంచెల్లోనూ ఉన్న పంచాయతీ రాజ్ సంస్థల అధికారిక భాగస్వామ్యం ద్వారా ఈ చట్టం వికేంద్రీకృత ప్రణాళిక, పర్యవేక్షణలను బలోపేతం చేస్తుందని చెప్పారు. పనుల్లో నాణ్యత, జవాబుదారీతనం లక్ష్యంగా.. ఈ చట్టం జిల్లా స్థాయిలో పర్యవేక్షణను మరింత మెరుగుపరుస్తుందని తెలిపారు. నిబంధనల ఆధారంగా రాష్ట్రాలకు కేటాయింపు పద్ధతిని కూడా ఈ విధానం ప్రవేశపెడుతోందనీ, దీంతో నిధుల కేటాయింపుల్లో స్పష్టత పెరగడమే కాకుండా, కేంద్రం - రాష్ట్రాల మధ్య 'సహకార సమాఖ్య' స్ఫూర్తి మరింత బలపడుతుందనీ అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఏఏఆర్ఎం తాత్కాలిక డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్నప్పటికీ, భారత్ నేడు వ్యవసాయ రంగంలో శ్రామికుల కొరతను ఎదుర్కొంటోందని తెలిపారు. వ్యవసాయం, అనుబంధ గ్రామీణ కార్యకలాపాల్లో కార్మికులను తిరిగి భాగస్వాములను చేయడం ద్వారా.. కొత్త చట్టం ఈ సమస్యను పరిష్కరిస్తుందన్నారు. కచ్చితమైన సమాచారాన్ని ప్రజలకు అందించడంలో జర్నలిస్టులదే కీలక పాత్ర అని పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ మానస్ కృష్ణకాంత్ స్పష్టం చేశారు. వీబీ- జీ రామ్ జీ చట్టంపై తప్పుడు సమాచారం ప్రజల్లోకి వెళ్లకుండా చూసేందుకు ప్రత్యేకంగా ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్టు తెలిపారు. ఈ చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని మీడియా ప్రతినిధులను కోరారు. కొత్త చట్టం వీబీ- జీ రామ్ జీని ప్రవేశపెట్టడమంటే పాత చట్టాన్ని నీరుగార్చడం కాదని ఎన్ఐఆర్‌డీపీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిస్ సత్యపాలన్ వ్యాఖ్యానించారు. ఎంజీఎన్ఆర్జీఏ చట్టానికి సవరణలు చేయాల్సిన ఆవశ్యకతను ప్రొఫెసర్ ప్రముఖంగా ప్రస్తావించారు. మెరుగైన ఫలితాలు లక్ష్యంగా చేసుకున్న దిద్దుబాటు చర్యగా దీనిని అభివర్ణించారు. ఈ వర్క్‌షాప్‌లో పీఐబీ మీడియా, కమ్యూనికేషన్ అధికారి వీ గాయత్రి, ఎన్ఏఏఆర్ఎం సీనియర్ అధికారులు, వివిధ పత్రికలు, చానళ్ల జర్నలిస్టులు పాల్గొన్నారు.



# టిక్కెట్ల కోసం నా వద్దకు రావొద్దు

**టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

సంగారెడ్డి, జనవరి 6 (ఈవార్తలు): రానున్న మున్సిపల్ ఎన్నికల్లో టిక్కెట్ల కోసం తన వద్దకు ఎవరూ రావొద్దని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తనను మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి పిలవొద్దని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎమ్మెల్యే కానున్న నిర్మలా జగ్గారెడ్డిని ఈ ఎన్నికల ప్రచారానికి పిలవాలని సూచించారు. జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణ ప్రజలు విశ్వసిస్తారని ఆయన అన్నారు. ఆమె గెలుపు కోసం చేసే వాగ్ధానాలన్నీ తానే నెరవేరుస్తానని భరోసా ఇచ్చారు. తన జీవితంలో తాను పోలీసులను ఎదిరించి రాజకీయం చేశానని గుర్తు చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని తాను ఎప్పుడూ రాజకీయం చేయలేదని అన్నారు. అధికారంలో ఉన్నామని పోలీసులను అడ్డుపెట్టుకుని గెలవాలని చూడవద్దని అన్నారు. ఈ ఎన్నికల్లో టిక్కెట్ల కోసం గాంధీ భవన్‌కు వెళ్లి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి ఇబ్బంది పెట్టవద్దని అన్నారు. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు ఇచ్చే హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి వాటిని నెరవేర్చే బాధ్యత తనదేనని అన్నారు. ఎన్నికల్లో పార్టీ నిలబెట్టిన అభ్యర్థులను ఓడించాలని చూస్తే వారిపై వేటు ఖాయమని హెచ్చరించారు



# హైదరాబాద్‌కు నిరంతరం నీరు

**రూ.8000 కోట్లతో ఓఆర్ఆర్ చుట్టూ వాటర్ గ్రిడ్.. 140 కిలోమీటర్ల వాటర్ రింగ్ మెయిన్ నిర్మాణం**

**ప్రాజెక్టు సమగ్ర నివేదికను సిద్ధం చేసిన జలమండలి**

**త్వరలో ప్రభుత్వానికి డీపీఆర్ సమర్పణ**

హైదరాబాద్, జనవరి 6 (ఈవార్తలు): భాగ్యనగర ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా హైదరాబాద్ మహానగర పాలక సంస్థ జలమండలి ఒక బృహత్ ప్రణాళికను సిద్ధం చేసింది. నగరానికి నిరంతరాయంగా, ఎలాంటి అంతరాయం లేకుండా నీటిని సరఫరా చేసే లక్ష్యంతో ఏకంగా రూ.8,000 కోట్ల అంచనా వ్యయంతో భారీ ప్రాజెక్టును ప్రతిపాదించింది. ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి ఒక వాటర్ రింగ్ మెయిన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలన్న ఈ ప్రతిపాదనకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక కూడా పూర్తయింది. త్వరలోనే దీన్ని పరిపాలన, ఆర్థిక అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో పాక్షికంగా లీనియర్ పైప్‌లైన్ వ్యవస్థ అమల్లో ఉంది. దీనివల్ల ప్రధాన పైప్‌లైన్‌లో ఎక్కడైనా మరమ్మతులు వచ్చినా లేదా ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినా, ఆ లైన్‌పై ఆధారపడిన లక్షలాది మందికి గంటల తరబడి, కొన్నిసార్లు రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోతోంది. ఉదాహరణకు, ఎల్బీ నగర్ జోన్‌లోని కొన్ని ప్రాంతాలు అక్కంపల్లి రిజర్వాయర్‌పైనే ఆధారపడటంతో 3 నుంచి 4 రోజులకు ఒకసారి మాత్రమే నీటిని పొందుతున్నాయి. ఈ సమస్యలను అధిగమించి, నగరాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ఈ రింగ్ మెయిన్ వ్యవస్థను ప్రతిపాదించారు. కోటిన్నర జనాభాకు చేరువవుతున్న నగరానికి ఈ ప్రాజెక్ట్ అత్యంత కీలకం కానుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఓఆర్ఆర్ చుట్టూ 140 కిలోమీటర్ల పొడవునా ప్రధాన పైప్‌లైన్ (రింగ్ మెయిన్) నిర్మిస్తారు. దీనికి అనుబంధంగా, ఓఆర్ఆర్‌కు సమీపంలోని అంతర్గత ప్రాంతాలకు నీటిని చేరవేసేందుకు 98 కిలోమీటర్ల పొడవైన రేడియల్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ వ్యవస్థ ద్వారా నగరానికి నీటిని సరఫరా చేస్తున్న ఐదు ప్రధాన వనరులైన గోదావరి, కృష్ణా, మంజీరా, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లను పరస్పరం అనుసంధానిస్తారు. "ఈ అనుసంధానం వల్ల నగరంలోని ఏ ప్రాంతమూ కేవలం ఒకే నీటి వనరుపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ఒక మార్గంలో సరఫరాకు అంతరాయం కలిగితే, తక్షణమే మరో మార్గం నుంచి నీటిని మళ్లించి సరఫరాను స్థిరీకరించవచ్చు. ఇది మొత్తం సరఫరా వ్యవస్థకు భరోసా ఇస్తుంది" అని జలమండలికి చెందిన ఒక సీనియర్ అధికారి వివరించారు. ఇదే సమయంలో, మంజీరా, ఉస్మాన్‌సాగర్ సరఫరా నెట్‌వర్క్‌ల ఆధునికీకరణకు రూ.1,000 కోట్లతో పనులు చేపడుతున్నామని, దీనివల్ల నీటి నష్టాలను తగ్గించి, నాణ్యతను పెంచవచ్చని ఆయన తెలిపారు. ఈ డీపీఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిన వెంటనే తదుపరి ప్రక్రియ ప్రారంభమవుతుంది. గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చే 2027 నాటికి ఈ రింగ్ మెయిన్ ప్రాజెక్టును కూడా పూర్తి చేయాలని జలమండలి లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే హైదరాబాద్ నీటి సరఫరా వ్యవస్థలో ఇదొక విప్లవాత్మక మార్పు అవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఏపీ లేకుంటే తెలంగాణ బతకదన్నారు..!

**కానీ, నేడు తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి: అక్బరుద్దీన్**

హైదరాబాద్, జనవరి 6 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ లేకుండా తెలంగాణ మనుగడ సాగించలేదని పన్నెండేళ్ల క్రితం ఒక నాయకుడు వ్యాఖ్యానించారని, అయితే ఈ కాలంలో తెలంగాణ ఎంతగా అభివృద్ధి చెందిందో చూడాలని మజ్లిస్ పార్టీ శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. తాము లేకుంటే తెలంగాణకు విద్యుత్ ఉండదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి పేర్కొన్నారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నీళ్లు, విద్యుత్ ఉండవని చెప్పారని తెలిపారు. ఆయన పేరును ప్రస్తావించదలుచుకోలేదని ఆయన అన్నారు. ప్రస్తుతం ఆయన వాషింగ్ మెషీన్ పార్టీ అయిన బీజేపీలో చేరారని ఎద్దేవా చేశారు. ఆయన కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆ వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. ఆ తర్వాత ఆయన పార్టీ మారారని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో కొన్ని మాటలను కావాలని తొలగిస్తున్నారని అక్బరుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. తాను ముఖ్యమైన విషయం గురించి మాట్లాడుతున్న సమయంలో ఆడియో డిస్టర్బెన్స్ వస్తోందని అన్నారు. హిల్ట్ (హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్) పాలసీపై చర్చ సందర్భంగా ఆయన అసెంబ్లీలో మాట్లాడారు.

# భూమికోసం ఎమ్మార్వో ఆఫీస్ ముందు నగ్న నిరసన

వికారాబాద్, జనవరి 6 (ఈవార్తలు): వికారాబాద్ జిల్లా, చౌడాపూర్ మండల కేంద్రంలో ఒక వ్యక్తి తమ తండ్రి భూమి తమకే దక్కాలని, కానీ తమ పేరు మీద విరాసత్ (వారసత్వ హక్కు) చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ తహసీల్దారు కార్యాలయం ఎదుట నగ్న ప్రదర్శనకు దిగాడు. చౌడాపూర్ మండలం, మల్కాపూర్ గ్రామానికి చెందిన హన్మయ్య అనే రైతుకు 7.29 ఎకరాల భూమి ఉంది. అతను మూడు సంవత్సరాల క్రితం మరణించాడు. హన్మయ్యకు మొదటి భార్యకు పిల్లలు లేకపోవడంతో ఆమె సోదరి ఈశ్వరమ్మను రెండో వివాహం చేసుకున్నాడు. వారికి నలుగురు సంతానం ఉన్నారు. భూమిని తమకు విరాసత్ చేయాలని కోరుతూ మొదటి భార్య గత నెలలో చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో స్లాట్ బుక్ చేసుకుంది. అయితే, సరైన పత్రాలు లేవని అధికారులు తిరస్కరించారు. హన్మయ్యకు తాను మూడో భార్య కుమార్తెనని పేర్కొంటూ కావలి యాదమ్మ అనే మహిళ కూడా రెవెన్యూ అధికారులను సంప్రదించింది. ఆ భూమి తనకు చెందాలని ఆమె దరఖాస్తు చేసుకుంది. ఇద్దరు వ్యక్తులు క్లెయిమ్ చేయడంతో అధికారులు ఎవరికీ విరాసత్ చేయలేదు. దీంతో అధికారులు నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ, రెండవ భార్య కుమారుడు సతీశ్ రెవెన్యూ కార్యాలయానికి వచ్చి నగ్నంగా నిరసన వ్యక్తం చేశాడు. తహసీల్దారు అతనితో మాట్లాడి, విచారణ జరిపి చట్ట ప్రకారం ఎవరు వారసులో వారికి భూమి చెందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో సతీష్ ఆందోళన విరమించాడు.

# కవిత కాంగ్రెస్‌లో చేరినా చేరొచ్చు!

**ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు**

**మల్‌రెడ్డి రంగారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**

హైదరాబాద్, జనవరి 6 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కవిత కాంగ్రెస్ పార్టీలో చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అన్నారు. గతంలో దానం నాగేందర్, కడియం శ్రీహరి వంటి నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తారని అనుకోలేదని, కానీ వారు వచ్చారని చెప్పారు. కవిత కూడా కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకే నష్టం జరుగుతుందని అన్నారు. పార్టీ పెద్దలు తన విషయంలో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. రెండు కోట్ల మంది ప్రజలు ఉన్న జిల్లాకు ఇంతవరకు మంత్రి పదవి ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా పేరు మారుస్తారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మల్‌రెడ్డి స్పందిస్తూ, పేరు మార్పు తనకు ఇష్టం లేదని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఎన్ని మున్సిపాలిటీలు అయినా చేసుకోవచ్చని, జిల్లా పేరు మాత్రం మార్చవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో రియల్ ఎస్టేట్ ఊపందుకుందని, భూముల ధరలు పెరుగుతాయనే ఉద్దేశంతో ఎవరూ అమ్ముకోవడానికి ఆసక్తి చూపడం లేదని ఆయన తెలిపారు.

# కవితకు మద్దతుగా తరలివచ్చిన అభిమానులు

హైదరాబాద్, జనవరి 6 (ఈవార్తలు): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇంటి వద్దకు భారీ సంఖ్యలో ఆమె అభిమానులు చేరుకున్నారు. 'తెలంగాణ జాగృతి'ని రాజకీయ శక్తిగా మార్చబోతున్నామని ఆమె ప్రకటించిన వెంటనే, రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నేతలు, ఉద్యమ కార్యకర్తలు భారీగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆమె నివాసం వద్దకు తరలివచ్చారు. ఈ సందర్భంగా కవిత తన ఇంటి బాల్కనీలో నిలబడి అందరికీ చేతులు జోడించి అభివాదం చేశారు. తర్వాత కిందకు వచ్చి ప్రతి ఒక్కరినీ పలకరించారు. "ఎలా ఉన్నారు? ఇంట్లో అందరూ బాగున్నారా?" అంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

# 50 వేలు లంచం.. దొరికిపోయిన ఎమ్మార్వో

**కామారెడ్డి జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్**

**భూమి బదిలీ రిపోర్ట్ కోసం రూ.50 వేలు డిమాండ్**



కామారెడ్డి, జనవరి 6 (ఈవార్తలు): కామారెడ్డి జిల్లాలో ఓ తహసీల్దార్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నాగిరెడ్డిపేట మండల తహసీల్దార్ యార్లగడ్డ శ్రీనివాసరావు, ఓ ప్రైవేట్ వ్యక్తితో కలిసి రూ.50,000 లంచం స్వీకరిస్తుండగా మంగళవారం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఒక వ్యక్తి తన తండ్రి పేరు మీద ఉన్న వ్యవసాయ భూమిని తన పేరు మీదకు మార్చుకోవడానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ ప్రక్రియలో అనుకూలంగా నివేదిక పంపేందుకు తహసీల్దార్ శ్రీనివాసరావు రూ.50,000 లంచం డిమాండ్ చేశాడు. ఈ మొత్తాన్ని చిన్నూరి అజయ్ అనే ప్రైవేట్ వ్యక్తి ద్వారా తనకు అందజేయాలని సూచించాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్నారు. బాధితుడు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అజయ్ ద్వారా డబ్బులు అందజేస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రసాయనం పూసిన నోట్లను స్వాధీనం చేసుకుని, వారి చేతులను పరీక్షించగా పాజిటివ్ రిజల్ట్ వచ్చింది. దీంతో తహసీల్దార్ శ్రీనివాసరావుతో పాటు మధ్యవర్తిగా వ్యవహరించిన అజయ్‌ను కూడా ఏసీబీ అరెస్ట్ చేసింది. అనంతరం ఇద్దరినీ హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు లేదా వాట్సాప్ (9440446106), ఇతర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా సమాచారం ఇవ్వాలని ఏసీబీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేసింది.

# ప్రియుడి మోజులో భర్త హత్య

**గుండె పోటుతో చనిపోయాడని నాటకం**

**మృతుడి సోదరుడి ఫిర్యాదుతో వెలుగులోకి**

**నిజామాబాద్ జిల్లాలో దారుణం**



నిజామాబాద్, జనవరి 6 (ఈవార్తలు): ప్రియుడి మోజులో భర్తను హత్య చేసి, గుండెపోటుగా నమ్మించే ప్రయత్నం చేసిన ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలు చేసిన దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలం బొర్గాంలో చోటుచేసుకోగా, స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి హత్య చేసి చివరకు కటకటాల పాలైంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పట్టాటి రమేశ్ (35) భార్య సౌమ్య ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉద్యోగం చేస్తోంది. అదే పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న దిలీప్‌తో ఆమెకు పరిచయం ఏర్పడి, అది క్రమంగా వివాహేతర సంబంధంగా మారినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం భర్త రమేశ్‌కు తెలియడంతో, ఇద్దరినీ గట్టిగా హెచ్చరించాడు. దీంతో భర్తను అడ్డు తొలగించుకోవాలని సౌమ్య నిర్ణయించుకున్నట్లు విచారణలో వెల్లడైంది. గత నెల 20న సౌమ్య తన ప్రియుడు దిలీప్‌తో కలిసి రమేశ్‌ను ఇంట్లోనే టవల్‌తో ఉరి పెట్టి హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. అనంతరం భర్త గుండెపోటుతో మృతి చెందినట్లు నమ్మించి, ఎవరికీ అనుమానం రాకుండా హడావుడిగా అంత్యక్రియలు నిర్వహించింది. అయితే అంత్యక్రియల సమయంలో రమేశ్ మెడపై గాట్లు కనిపించడంతో గ్రామస్థులకు అనుమానం వచ్చింది. వెంటనే ఇజ్రాయెల్‌లో ఉన్న అతని తమ్ముడు కేదారికి సమాచారం అందించారు. కేదారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు మలుపు తిరిగింది. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి విచారణ చేపట్టగా, అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడన్న కారణంతోనే హత్య చేసినట్లు సౌమ్య ఒప్పుకున్నట్టు తెలిపారు. ఈ కేసులో సౌమ్యతో పాటు మరో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పదమూడు సంవత్సరాల వైవాహిక బంధం, ముగ్గురు పిల్లలు ఉన్నప్పటికీ భర్తను హత్య చేసిన ఘటనపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నారు.

# అజ్ఞాత జీవితం..




# అస్తిత్వ మాయ



## 52 మందిలో ఆచూకీ లేని 35 మంది నక్సల్స్

## అడవుల్లో తుపాకుల పోరాటం మౌనం

**మావోయిస్టు ఉద్యమం.. ఒకప్పుడు అడవుల్ని కంపించిన తుపాకుల శబ్దం, విప్లవ నినాదాలు, సిద్ధాంతాలపై అచంచల విశ్వాసం. కానీ నేడు అదే ఉద్యమం ముందు ఒక అసహజ ప్రశ్న నిలుస్తోంది. అజ్ఞాతంలోకి వెళ్లిన 52 మంది కేడర్‌లో 35 మంది ఆచూకీ లేకుండా మాయమయ్యారు. వారు చనిపోయారా? జీవించారా? ఉద్యమంలో ఉన్నారా? లేక ఉద్యమాన్నే వదిలేశారా? అనే ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు.**



(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)

తెలంగాణ నిఘా వర్గాల పక్కా సమాచారంతో రూపొందిన తాజా నివేదిక ప్రకారం, రాష్ట్రానికి చెందిన మొత్తం 52 మంది మాత్రమే ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. వీరిలో 17 మంది మాత్రమే ఇప్పటికీ సిపిఐ (మావోయిస్టు) పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన 35 మంది పూర్తిగా కనిపించకుండా పోవడం మావోయిస్టు ఉద్యమ చరిత్రలోనే అరుదైనదిగా, అదే సమయంలో ఆందోళన కలిగించే పరిణామంగా నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఉద్యమాల్లో అజ్ఞాత జీవితం కొత్తది కాదు. కానీ అజ్ఞాతంలో ఉంటూనే పార్టీకే, సహచరులకే, కుటుంబాలకే జాడ తెలియకుండా పోవడం మాత్రం అసాధారణం. సాధారణంగా మావోయిస్టు కేడర్ ఎదురుకాల్పుల్లో మరణిస్తే లేదా అనారోగ్యంతో చనిపోయినా పార్టీ స్థాయిలో కుటుంబాలకు సమాచారం చేరుతుంది. అడవుల్లోనే అంత్యక్రియలు నిర్వహించి వీడియోలు తీసి పంపించడం మావోయిస్టు పద్ధతిలో భాగమే. కానీ ఈ 35 మంది విషయంలో అలాంటి ఒక్క ఆధారమూ లేదు. ఎదురుకాల్పుల్లో మరణించిన రికార్డులు లేవు, అనారోగ్యంతో చనిపోయిన సమాచారం లేదు, కుటుంబాలకు పార్టీ నుంచి ఏ సందేశమూ చేరలేదు. అంటే పార్టీలో కొనసాగుతూనే వారు మరణించిన దాఖలాలే లేవన్నదే నిఘా వర్గాల స్పష్టత. ఇటీవల వరుసగా జరుగుతున్న లొంగుబాట్లు, లొంగిపోయిన మావోయిస్టులను విచారించిన అనంతరం ఈ నిజాలు బయటపడ్డాయి. దీనికి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఎందుకంటే ఆపరేషన్ కగార్ తుది దశకు చేరుకుంటోంది. ఈ నేపథ్యంలో కేడర్ స్థితిగతులపై నిఘా వర్గాలు లోతైన విశ్లేషణ చేపట్టగా, “కనిపించని 35 మంది” అంశం స్పష్టంగా వెలుగులోకి వచ్చింది.

### ఆ 35 మంది ఎక్కడ?

నిఘా వర్గాల అంచనాల ప్రకారం ఈ 35 మంది అజ్ఞాతంలో ఉంటూనే ఉద్యమానికి మెల్లగా దూరమైపోయి, కుటుంబాలతోనూ సంబంధాలు తెంచుకుని ఉండవచ్చు. నిఘా తీవ్రంగా లేని సమయంలో విదేశాలకు వెళ్లిపోయే అవకాశాలు కూడా లేకపోలేదని భావిస్తున్నారు. మరోవైపు గుర్తింపులు మార్చుకుని ఎక్కడో సాధారణ జీవితం గడుపుతూ ఉంటారని కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుమానాలకు బలం చేకూర్చే ప్రత్యక్ష ఉదాహరణగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా జగిత్యాలలోని బీర్పూర్‌కు చెందిన బల్మూరి నారాయణరావు ఉదంతాన్ని నిఘా వర్గాలు ప్రస్తావిస్తున్నాయి. 1980లో పీపుల్స్ వార్‌లో చేరిన ఆయన 2024 డిసెంబర్‌లో ఛత్తీస్‌గఢ్ కాంకేర్ జిల్లా అంతఘర్ ప్రాంతంలో అరెస్టయ్యారు. ఆయనకు మావోయిస్టు అగ్రనేతలతో సంబంధాలున్నాయని అక్కడి పోలీసులు ప్రకటించినా, తెలంగాణ నిఘా వర్గాల విచారణలో మాత్రం సుదీర్ఘకాలంగా ఉద్యమానికి దూరమై సాధారణ జీవితం గడుపుతున్నట్లు తేలింది. ఇదే తరహాలో ఆ 35 మంది కూడా ఎక్కడో నిశ్శబ్దంగా జీవితం కొనసాగిస్తూ ఉండవచ్చున్న అంచనా బలపడుతోంది.



ఆచూకీ లేని ఈ 35 మంది కేడర్ వివరాలు జిల్లాల వారీగా ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం చిట్యాల నుంచి డీసీ మెంబర్ కొల్లు శ్రీనివాస రెడ్డి, ఏడూళ్ల బయ్యారం మండలం జానంపేట్ నుంచి పార్టీ సభ్యుడు రాయల రాము ఉన్నారు. రంగారెడ్డి జిల్లా అమనగల్లు మండలం కోనాపూర్‌కు చెందిన డీసీ మెంబర్ చాకలి నిరంజన్ అలియాస్ వినయ్ ఉన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ అంబేద్కర్ నగర్‌కు చెందిన డీసీ మెంబర్ చింతకింది అంజమ్మ అలియాస్ అరుణ ఉన్నారు. జగిత్యాల జిల్లా మోరేపల్లి నుంచి డీసీ మెంబర్ గుండారపు ఆనందం, కోరుట్ల ఇంద్రారోడ్ నుంచి డీసీ మెంబర్ బెజ్జారపు కిషన్ అలియాస్ ప్రతాప్, రాయికల్ మండలం కట్కాపూర్‌కు చెందిన ఏసీ మెంబర్ ముదాం లక్ష్మణ్ ఉన్నారు. జనగామ జిల్లా పల్లగుట్టకు చెందిన డీసీ మెంబర్ కన్నెబోయిన మల్లయ్య అలియాస్ గంగన్న, రఘునాథపల్లి మండలం బాంజీపేట్‌కు చెందిన ఏసీ మెంబర్ కందగడ్డ రాజేశ్వర్ అలియాస్ భాస్కర్, లింగాల ఘనపూర్ మండలం నెల్లుట్లకు చెందిన ఏసీ మెంబర్ పొనుంగటి శారద ఉన్నారు. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం రామచంద్రాపూర్‌కు చెందిన ఏసీ మెంబర్ గాజె రాజు అలియాస్ రవి ఉన్నారు. కామారెడ్డి జిల్లా అడ్లూర్‌కు చెందిన పీఎం లింబయ్యగారి వెంకట్ రెడ్డి, కరీంనగర్ జిల్లా చెల్పూర్‌కు చెందిన పీఎం దేవరకొండ సత్యనారాయణరెడ్డి అలియాస్ సత్తన్న ఉన్నారు. మహబూబాబాద్ జిల్లా కోరుకొండపల్లికి చెందిన ఎస్సీఎం వెంకట్ రెడ్డి, కురవి మండలం తట్టుపల్లికి చెందిన డీసీఎస్ షేక్ అమీనుద్దీన్ అలియాస్ ఉదయ్ కిరణ్ ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా న్యూప్రేమ్‌నగర్‌కు చెందిన ఏసీఎస్ నిర్మల అలియాస్ లలిత ఉన్నారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి శాంతినికేతన్ బస్తీకి చెందిన ఏసీఎస్ ఆరెపల్లి కృష్ణ అలియాస్ కిష్టు, మందమర్రికి చెందిన పీఎం బబ్బెర రవిబాబు అలియాస్ రవి ఉన్నారు. ములుగు జిల్లా రామచంద్రాపూర్‌కు చెందిన ఏసీఎస్ కనుకుంట్ల రాజు, ఏటూరు నాగారం మండలం గోగుపల్లికి చెందిన పీఎం ఈసం అర్జున్ అలియాస్ రఘుపతి ఉన్నారు. నల్గొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్లకు చెందిన డీసీఎస్ మందుగుల భాస్కర్‌రావు, గుర్రంపోడ్ మండలం ఊట్లపల్లికి చెందిన పీఎం పన్నాల యాదయ్య అలియాస్ గన్ మన్ ఉన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం బావాపూర్-కెకు చెందిన పీఎం తూము శ్రీనివాస్ అలియాస్ శ్రీను, నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ఇందల్వాయికి చెందిన పీఎం నాగపూరి లక్ష్మాగౌడ్ అలియాస్ లచ్చాపూర్ ఉన్నారు. పెద్దపల్లి జిల్లా సబితం గ్రామానికి చెందిన ఏసీసీఎం గంకిడి సత్యనారాయణరెడ్డి అలియాస్ విజయ్, పాలితం గ్రామానికి చెందిన డీసీఎస్ ఆలేటి రామలచ్చులు అలియాస్ రాయలచ్చులు, పాలితం గోపయ్యపల్లికి చెందిన ఏసీఎస్ దత్తు అయిలయ్య, జూలపల్లి మండలం వెంకట్రావుపల్లికి చెందిన ఏసీఎస్ దీకొండ శంకరయ్య అలియాస్ శేషన్న, సుల్తానాబాద్ మండలం కొదురుపాకకు చెందిన ఏసీఎం జువ్వాడి వెంకటేశ్వరరావు అలియాస్ ధర్మన్న ఉన్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారానికి చెందిన ఏసీఎం రంగబోయిన భాగ్య అలియాస్ రూపి, నంగనూర్‌కు చెందిన ఏసీఎం రంగు అరుణ అలియాస్ పద్మ, అక్కన్నపేటకు చెందిన ఏసీఎం కాశబోయిన స్వరూప ఉన్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారానికి చెందిన డీసీఎస్ ఉల్లెంగుల యాకయ్య అలియాస్ అంజన్న, మిల్స్ కాలనీకి చెందిన డీసీఎం పోలెపాక సునీల్, హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శంభునిపల్లికి చెందిన పీఎం కనగర్తి రజనీకర్ రెడ్డి కూడా ఇప్పటికీ ఆచూకీ లేకుండా ఉన్న కేడర్‌లోనే ఉన్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఉద్యమంలో చురుగ్గా కొనసాగుతున్న వారు మాత్రం గణపతి, దేవ్ జీ, సంగ్రాం, పసునూరి నరహరి, బడే చొక్కారావు, ముప్పిడి సాంబయ్య, వార్తా శేఖర్, జోడె రత్నాబాయి, నక్క సుశీల, లోకేటి చందర్ రావు, జాడి పుష్ప, రంగబోయిన భాగ్య, బడిశ ఉంగా, మాడ్వి అడుమే, కాశపోగు భవాని, కుంజం ఇడ్మల్, ఉతిమి అనిల్ కుమార్... ఈ 17 మంది మాత్రమేనని నిఘా వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ కథనం కేవలం మావోయిస్టుల సంఖ్యల గురించినది కాదు. ఇది ఒక సిద్ధాంత ఉద్యమం ఎదుర్కొంటున్న లోతైన అంతర్గత క్షీణతపై స్పష్టమైన సంకేతం. ఒకప్పుడు “విప్లవమే జీవితం” అనుకున్న కేడర్, నేడు జీవితమే విప్లవం కంటే విలువైనదిగా భావిస్తున్నారా? అనే ప్రశ్నను ఈ పరిణామం లేవనెత్తుతోంది. తుపాకుల మార్గం నుంచి సాధారణ జీవితం వైపు నిశ్శబ్దంగా మళ్లిపోవడం.. ఇది మావోయిస్టు ఉద్యమానికి ఎదురైన అతి పెద్ద అంతర్గత సవాలు. అజ్ఞాతంలోకి వెళ్లి మాయమైన ఆ 35 మంది నిజంగా ఎక్కడో జీవిస్తున్నారు అనుకుంటే, అది ఉద్యమానికి అప్రకటిత ఓటమి అనే చెప్పాలి.



## విద్యుత్తు సమస్యకు 1912 టోల్ ఫ్రీ

**విద్యుత్తు అధికారి సుదర్శనం వెల్లడి**

జగిత్యాల రూరల్, జనవరి 6 (ఈవార్తలు): వినియోగదారులకు విద్యుత్తు సమస్యలు ఉంటే 1912 టోల్ ఫ్రీ నంబర్‌ను వినియోగించాలని తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ జగిత్యాల జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ బొంకురి సుదర్శనం సూచించారు. మంగళవారం మోతే గ్రామంలో ప్రజా బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే సంస్థ లక్ష్యం అని, అందరికి అందుబాటులో ఉంటూ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడం కోసం ప్రతి విద్యుత్ ఉద్యోగి కృషి చేస్తున్నారని అన్నారు. విద్యుత్ వినియోగదారులు భద్రత నియమాలు పాటిస్తూ జాగ్రత్త వహించాలని కోరారు. కార్యక్రమంలో జగిత్యాల డివిజనల్ ఇంజనీర్ (టెక్నికల్) అంజయ్య, డివిజనల్ ఇంజనీర్ గంగారాం, జగిత్యాల టౌన్ సహాయక డివిజనల్ ఇంజనీర్ జవహర్ లాల్ నాయక్, చల్‌గల్ సెక్షన్ సహాయ ఇంజనీర్ శ్రీధర్, మోతె సర్పంచ్ మహేశ్, స్థానిక పంచాయతీ కార్యదర్శి, స్థానిక రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## నేడు ఢిల్లీకి ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 6 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఆయన సమావేశం కానున్నారు. వీరిద్దరి మధ్య డిన్నర్ మీటింగ్ జరగనుండగా, రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించేందుకు ఈ భేటీ వేదిక కానుంది. ఈ సమావేశంలో ప్రధానంగా రాష్ట్ర అభివృద్ధి, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల పురోగతి వంటి అంశాలపై చంద్రబాబు చర్చించనున్నట్లు సమాచారం. వీటితో పాటు తాజా రాజకీయ పరిణామాలపైనా ఇరువురు నేతలు చర్చించుకునే అవకాశం ఉంది. రాష్ట్రానికి కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో సహకారం సాధించడమే లక్ష్యంగా ఈ భేటీ జరగనున్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం... బుధవారం సాయంత్రం 3:30 గంటలకు రాజమండ్రి విమానాశ్రయం నుంచి చంద్రబాబు ఢిల్లీకి బయలుదేరతారు. రాత్రి అమిత్ షాతో డిన్నర్ మీటింగ్ ఉంటుంది. అనంతరం రాత్రి 11 గంటలకు ఢిల్లీ నుంచి విమానంలో తిరుగుపయనమై, అర్ధరాత్రి 1:30 గంటలకు విజయవాడ సమీపంలోని ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.

## కృష్ణా తీరంలో మెరీనా వాటర్ ఫ్రంట్



అమరావతి, జనవరి 6 (ఈవార్తలు): నవ్యాంధ్ర రాజధాని అమరావతికి పర్యాటక రంగంలో సరికొత్త శోభను తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. కృష్ణా నదీ తీరాన్ని అంతర్జాతీయ స్థాయిలో ‘మెరీనా వాటర్ ఫ్రంట్‘గా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. మంగళవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 57వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు. అమరావతిని ప్రపంచ పటంలో ఒక ప్రత్యేక పర్యాటక కేంద్రంగా నిలపాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. మెరీనా వాటర్ ఫ్రంట్‌లో భాగంగా జెట్టీలు, పర్యాటకుల కోసం లీజర్ బోట్లు, ఫుడ్ ప్లాజాలు, ఆహ్లాదాన్ని పంచే ల్యాండ్‌స్కేప్ పనులను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. దీనికి సంబంధించి వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. వాటర్ ఫ్రంట్ రూపకల్పన కోసం ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని, రివర్ ఫ్రంట్‌తో పాటు వాటర్ స్పోర్ట్స్ యాక్టివిటీస్‌కు కూడా ఇందులో చోటు కల్పించాలని స్పష్టం చేశారు. ‘బ్లూ-గ్రీన్ సిటీ‘గా అమరావతిని తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా అంతర్గత కాలువల నిర్మాణం, సుందరీకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువన నిర్మించనున్న నూతన బ్యారేజీతో రాజధానికి నీటి వనరులు సమృద్ధిగా అందుబాటులోకి వస్తాయని చంద్రబాబు వివరించారు. దీనివల్ల కృష్ణా నదికి ఇరువైపులా అద్భుతమైన వాటర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసుకునేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. నదిలో ఉన్న ఐల్యాండ్స్‌ను కూడా పర్యాటకపరంగా ఎలా అభివృద్ధి చేయవచ్చో పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాజధాని కోసం భూములిచ్చిన భూమిలేని నిరుపేదలకు ఇస్తున్న పెన్షన్‌ను, తల్లిదండ్రులను కోల్పోయిన మైనర్ అనాథలకు కూడా వర్తింపజేయాలని నిర్ణయించారు. దీని ప్రకారం అర్హులైన మైనర్లకు నెలకు రూ.5,000 చొప్పున పెన్షన్ అందనుంది. అదేవిధంగా, రైతులకు కేటాయించిన ప్లాట్లలో వాస్తురీత్యా అనుకూలంగా లేని 112 ‘వీధిశూల‘ ప్లాట్లకు బదులుగా మరోచోట ప్రత్యామ్నాయ ప్లాట్లను కేటాయించేందుకు అంగీకారం తెలిపారు. అయితే, మ్యుటేషన్ పూర్తికాని, థర్డ్ పార్టీకి విక్రయించని ప్లాట్లకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం నొక్కిచెప్పారు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీఎల్), సీఆర్డీఏ సంస్థలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఇందుకోసం ప్రత్యేక రెవెన్యూ మోడల్స్‌ను అధ్యయనం చేయాలని, ఆస్తులను సమకూర్చుకుని సుస్థిర ఆదాయం పొందేలా రెండు సంస్థలు ఎదగాలని దిశానిర్దేశం చేశారు. అమరావతిలో తలపెట్టిన స్పోర్ట్స్ సిటీ వంటి ప్రాజెక్టుల కోసం ఖతార్ మోడల్‌ను అధ్యయనం చేయాలని సూచించారు. రాజధాని నిర్మాణ పనులన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, పురపాలక, సీఆర్డీఏ, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## అ,ఆలు దిద్దుదాం

**మహిళలకు చదవడం రాయడం నేర్చుకోవాలి: రాజాగౌడ్**

**జగిత్యాలలో అమ్మకు అక్షర మాల కార్యక్రమం నిర్వహణ**

జగిత్యాల టౌన్, జనవరి 6 (ఈవార్తలు): స్వయం సహాయక మహిళా సంఘం సభ్యులకు చదవడం, రాయడం నేర్చుకొనుటకు రూపొందించిన అమ్మకు అక్షర మాల కార్యక్రమాన్ని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా ) ఆధ్వర్యంలో మంగళవారం జగిత్యాలలో నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ బీ రాజగౌడ్ పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులంతా తప్పనిసరి రాయడం, చదవడం నేర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మెప్మా ఏవో శ్రీనివాస్ గౌడ్, డీఎంసీ సునీత, టీఎంసీ రజిత, సీవోలు రాధ, గంగారాణి, శరణ్య, సీఆర్పీలు మాధవీలత, స్రవంతి, జగిత్యాల పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగలక్ష్మి, పట్టణంలోని మహిళా సమాఖ్యల ప్రతినిధులు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

## ఇంకా అదుపులోకి రాని మంటలు

**కోనసీమలో గ్యాస్ లీకేజీ ప్రమాదం**

కోనసీమ జిల్లా, జనవరి 6 (ఈవార్తలు): కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలోని ఓఎన్‌జీసీ బావిలో చెలరేగిన మంటలు రెండో రోజు కూడా అదుపులోకి రాలేదు. సోమవారం మధ్యాహ్నం మోరి-5 బావిలో రిపేర్ పనులు చేస్తుండగా అధిక పీడనంతో గ్యాస్, ముడి చమురు బయటకు చిమ్మి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనతో సమీప గ్రామాల్లో భయాందోళన వాతావరణం నెలకొంది. ఓఎన్‌జీసీ సాంకేతిక నిపుణులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అంతర్జాతీయ నిపుణుల సహాయం కూడా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రమాద స్థలాన్ని పూర్తిగా ఆధీనంలోకి తీసుకుని, బావిని చల్లబరిచే పనులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతానికి నీరు, మట్టితో మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు రెండు లారీల్లో కూలెంట్ ను తీసుకువస్తున్నారు. దీని సాయంతో మంటలు ఆర్పడంలో పురోగతి కనిపిస్తుందని భావిస్తున్నారు. కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా ఘటనా స్థలంలోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా ఇరుసుమండ, మోరి గ్రామాలకు చెందిన సుమారు 500 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి భోజనం, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన అమలాపురం ఎంపీ గంటి హరీశ్ బాలయోగి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారని చెప్పారు. బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.



# వెనెజువెలా సంక్షోభం మనకేం ఢోకా లేదు!

న్యూఢిల్లీ: అమెరికా, వెనెజువెలా మధ్య కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారతదేశంపై తక్షణ ప్రభావం చూపబోవని, ప్రస్తుత పరిస్థితుల్లో భారత దేశ చమురు దిగుమతి వ్యయం పెరిగే అవకాశం లేదని మంగళవారం విడుదలైన ఒక నివేదిక స్పష్టం చేసింది. బ్యాంక్ ఆఫ్ బరోడా విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు సరఫరా అవసరానికి మించి (గ్లట్ మోడ్) ఉండటం, అంతర్జాతీయ ఉత్పత్తిలో వెనెజువెలా వాటా కేవలం 1 శాతం మాత్రమే కావడం ఇందుకు ప్రధాన కారణాలు. అందువల్ల, వెనెజువెలాలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నా, భారత్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నివేదిక భరోసా ఇచ్చింది. వెనెజువెలాలో నిరూపితమైన చమురు నిల్వలు చాలా ఎక్కువని, ప్రపంచ మొత్తం నిల్వల్లో దాదాపు 19.4 శాతం అక్కడే ఉన్నాయని బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక పేర్కొంది. ఈ భారీ నిల్వలను వెలికితీసి, సరఫరా పెంచేందుకు అమెరికా కంపెనీలు రంగంలోకి దిగవచ్చన్న మార్కెట్ అంచనాలతో ఇప్పటికే అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. ఈ పరిణామం భారత్‌కు మేలు చేసే అంశమని విశ్లేషకులు భావిస్తున్నారు. "ప్రస్తుత ప్రపంచ సరఫరా పరిస్థితులు, మిగులు నిల్వలను పరిగణనలోకి తీసుకుంటే, సమీప భవిష్యత్తులో భారత్ ఆయిల్ దిగుమతి బిల్లు పెరిగే ప్రమాదం కనిపించడం లేదు" అని నివేదికలో స్పష్టం చేశారు. ఒకవేళ అమెరికా కంపెనీలు వెనెజువెలాలో ఉత్పత్తిని పెంచితే, అంతర్జాతీయంగా ధరలు మరింత తగ్గి, భారత్ సహా అన్ని దేశాలకూ లబ్ధి చేకూరుతుందని మరో నివేదికలో విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. భారత్, వెనెజువెలా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ప్రస్తుతం 1.9 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో భారత్ నుంచి ఎగుమతులు 217 మిలియన్ డాలర్లు కాగా, దిగుమతులు 1.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ దిగుమతుల్లో పెట్రోలియం, ఆయిల్, లూబ్రికెంట్స్ వాటానే అత్యధికం. "భారత్ దిగుమతి చేసుకుంటున్న దేశాలతో పోలిస్తే వెనెజువెలా నుంచి వస్తున్న ముడి చమురు యూనిట్ విలువ తక్కువగా ఉంది. ఇది మన దిగుమతి ఖర్చులను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది" అని బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థికవేత్త దీపాన్వితా మజుందార్ వివరించారు. అయితే, గత ఐదేళ్లుగా వెనెజువెలాకు భారత ఎగుమతులు సగటున ఏటా 8.8 శాతం మేర క్షీణిస్తున్నాయి. ఇదే సమయంలో ప్రపంచానికి భారత్ చేస్తున్న మొత్తం ఎగుమతులు 6.9 శాతం వృద్ధి చెందాయి. దీన్నిబట్టి వెనెజువెలాతో వాణిజ్య సంబంధాలు మందగించాయని అర్థమవుతోంది. వెనెజువెలా నుంచి ముడి చమురును అధికంగా ఎగుమతి చేసుకుంటున్న దేశాల్లో అమెరికా మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాత చైనా, భారత్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొనసాగుతున్న చర్చల్లో చమురు దౌత్యం కీలక పాత్ర పోషిస్తోంది. కాగా, ఈ ప్రాంతంలోని భౌగోళిక రాజకీయ అనిశ్చితి కారణంగా వెనెజువెలాలో భారీ పెట్టుబడులు పెట్టడానికి కంపెనీలు వెనకడుగు వేయవచ్చని, ఇది చమురు ఉత్పత్తి పెంపునకు అడ్డంకిగా మారవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.




## ఆఫీస్ అటెండెన్స్ కచ్చితం: విప్రో

ముంబై: టెక్ కంపెనీలు ఒక్కొక్కటిగా వర్క్ ఫ్రమ్ హోమ్ సడలింపులను తగ్గిస్తూ, ఆఫీస్ అటెండెన్స్‌ను కఠినతరం చేస్తున్నాయి. తాజాగా భారతీయ ఐటీ దిగ్గజం విప్రో కూడా తన హైబ్రిడ్ వర్క్ పాలసీని మరింత స్ట్రిక్ట్ చేసింది. వారానికి 3 రోజులు ఆఫీస్ రావాల్సిందేనని స్పష్టం చేసింది. ఇకపై ఆఫీస్ రోజుల్లో ఉద్యోగులు కనీసం 6 గంటలు ఆఫీస్‌లోనే ఉండాలి (స్వైప్ ఇన్ నుంచి స్వైప్ అవుట్ వరకు). రోజుకు 9 గంటలు పనిచేయాల్సి ఉండగా మిగిలిన 3 గంటల సమయం ఇంటి నుంచి చేసుకోవచ్చు. ఆఫీస్ అటెండెన్స్ రూల్స్ పాటించకపోతే లీవ్స్‌పై ప్రభావం పడుతుందని విప్రో తెలిపింది. ప్రత్యేక పరిస్థితుల్లో (అనారోగ్యం, కుటుంబ సంరక్షణ) ఏడాదికి రిమోట్ వర్క్ డేస్ సౌకర్యం 15 రోజుల నుంచి 12 రోజులకు తగ్గించారు. విప్రో తీసుకున్న నిర్ణయం ఉద్యోగుల్లో మిక్స్‌డ్ రియాక్షన్స్ తెచ్చిపెడుతోంది. కొందరు ఆఫీస్ కల్చర్ మళ్లీ రావడం మంచిదని అంటుంటే, మరికొందరు ట్రాఫిక్, టైం మేనేజ్‌మెంట్ సమస్యలు ఎక్కువవుతాయని ఆందోళన చెందుతున్నారు.

# మోదీని ట్రంప్ కిడ్నాప్ చేస్తారా?

**కాంగ్రెస్ నేత సంచలన వ్యాఖ్యలు**

**పృథ్వీరాజ్ చవాన్ వ్యాఖ్యలపై నెటిజన్లు ఆగ్రహం**



ముంబై: వెనెజువెలాలో నికోలస్ మదురోకు జరిగినట్లుగా భారతదేశంలో కూడా జరుగుతుందా? అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మన ప్రధానమంత్రిని కూడా కిడ్నాప్ చేస్తారా? అని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పృథ్వీరాజ్ చవాన్ ప్రశ్నించారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెనెజువెలా అధ్యక్షుడిగా ఉన్న మదురోను అమెరికా అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ అంశంపై పృథ్వీరాజ్ చవాన్ మాట్లాడుతూ, వెనెజువెలా సంక్షోభంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనంగా ఉన్నారని ఆరోపించారు. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి ఎన్నికైన అధ్యక్షుడిని తొలగించినప్పటికీ భారత్ మౌనంగా ఉందని అన్నారు. అమెరికా చర్యలు ప్రపంచానికి చెడు సంకేతాన్ని అందిస్తాయని అన్నారు. వెనెజువెలాలో ఎన్నికైన అధ్యక్షుడిని కిడ్నాప్ చేశారని, రేపు మరే దేశాధినేతకైనా ఇలా జరగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భారతదేశానికి కూడా జరగవచ్చని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని వివిధ సంఘర్షణలపై భారత ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని తీసుకోవడంలో విఫలమైందని చవాన్ ఆరోపించారు. రష్యా, చైనాలు ఏదో ఒక వైఖరిని తీసుకున్నాయని వెల్లడించారు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాల విషయంలోనూ భారత్ స్పష్టమైన వైఖరిని చెప్పలేకపోయిందని ఆరోపించారు. మనం అమెరికాకు భయపడుతున్నట్లుగా ఉందని అన్నారు. మదురో అమెరికాలో డ్రగ్స్ సరఫరా చేస్తున్నారంటూ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. వెనెజువెలా ఆయిల్ నిల్వలే కిడ్నాప్‌కు ప్రధాన కారణమని అనుమానం వ్యక్తం చేశారు. మనం మరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్నా, భద్రతా మండలిలో శాశ్వత సభ్యులు కావాలన్నా ప్రపంచ అంశాలపై స్పష్టమైన వైఖరిని తీసుకోవాలని అన్నారు. భారతదేశ ఉత్పత్తులపై అమెరికా అధిక వాణిజ్య పన్నులు విధించడాన్ని పృథ్వీరాజ్ చవాన్ తప్పుబట్టారు. మన ఎగుమతులపై ప్రత్యక్ష నిషేధం విధించలేక, వాణిజ్యాన్ని ఆపేందుకు సుంకాలను ట్రంప్ ఒక సాధనంగా ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. అమెరికాకు ఎగుమతులు చేయడం ద్వారా గతంలో ఆర్జించిన లాభాలు ఇప్పుడు రావని, మనం ప్రత్యామ్నాయ మార్కెట్లను అన్వేషించాలని అన్నారు. పృథ్వీరాజ్ చవాన్ చేసిన వ్యాఖ్యలపై జమ్ము కశ్మీర్ మాజీ పోలీసు అధికారి ఎస్పీ వైద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడి వ్యాఖ్యలు దేశాన్ని అవమానించేలా ఉన్నాయని మండిపడ్డారు. పృథ్వీరాజ్ చవాన్ బ్రెయిన్ డెడ్ అయిందని, నిరక్షరాస్యుడని, మూర్ఖుడంటూ సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. మదురోకు ట్రంప్ చేతిలో ఎదురైన అనుభవమే మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కూడా జరగాలని కాంగ్రెస్ నేత చవాన్ కోరుకోవడం దేశాన్ని అవమానించడమేనని వైద్ అన్నారు. పృథ్వీరాజ్ చవాన్ కనీసం మాట్లాడే ముందు ఆలోచన చేయాల్సిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అసలు భావజాలం ఇదేనా, ఇప్పుడు వారి రంగు బయటపడుతోందని అన్నారు.

## సిందూర్ దెబ్బకు పాక్ పరుగో పరుగు

**అమెరికాతో దాయాది లాబీయింగ్**

**వివిధ వర్గాలతో 50కి పైగా భేటీలు**

న్యూఢిల్లీ: భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ అమెరికాతో లాబీయింగ్ కోసం ప్రయత్నించింది. ఈ మేరకు 50కి పైగా సమావేశాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. యూఎస్ ఫారిన్ ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్ కింద దాఖలైన పత్రాలను ఉటంకిస్తూ ఓ జాతీయా మీడియా సంస్థ కథనాన్ని ప్రచురించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో అమెరికా ప్రభుత్వాధికారులు, చట్ట సభ్యులు, మీడియా సంస్థలతో పాక్ బృందాలు 50కి పైగా సమావేశాలు జరిపినట్లు సమాచారం. 60 మంది అధికారులు, మధ్యవర్తులకు ఈ-మెయిల్స్, ఫోన్ కాల్స్ చేశాయి. అమెరికా అధికారులతో వ్యక్తిగత సమావేశాలు కూడా నిర్వహించాయి. భారత సైనిక చర్యను ఆపే లక్ష్యంతో వాషింగ్టన్ జోక్యం చేసుకునేందుకు షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో జరిగిన ఈ సమావేశాల్లో కశ్మీర్ అంశం, ప్రాంతీయ భద్రత, అరుదైన ఖనిజాలు, ద్వైపాక్షిక సంబంధాల గురించి కూడా చర్చించినట్లు తెలుస్తోంది. లాబీయింగ్ కోసం ఆ దేశం భారీగా ఖర్చు చేసిందని, ఆపరేషన్ సిందూర్ జరిగిన సమయంలో ఆ మొత్తం భారీగా పెరిగిందని అమెరికాలోని ఓ ప్రముఖ మీడియా సంస్థ పరిశోధనలో తేలినట్లు వెల్లడించింది. ట్రంప్ యంత్రాంగానికి మరింత చేరువయ్యేందుకు దౌత్య, వాణిజ్యపరమైన అంశాల్లో అనుకూల ఫలితాలు పొందేందుకు లాబియింగ్ సంస్థలతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది.



## యూపీలో 2.8 కోట్ల ఓట్ల తొలగింపు

**ఎస్ఐఆర్ తర్వాత 12.56 కోట్లకు తగ్గిన ఓటర్లు**

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) మంగళవారం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. మొత్తం 15.44 కోట్ల మంది ఓటర్లలో 2.8 కోట్ల మంది ఓటర్లను తొలగించినట్లు ఈసీ తెలిపింది. శాశ్వతంగా వలసపోయిన వారు, మరణించిన వారు, బహుళ రిజిస్ట్రేషన్లు వంటి కారణాల వల్ల ఈ తొలగింపులు జరిగాయని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా తెలిపారు. ప్రస్తుతం 12.55 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితాలో కొనసాగించినట్లు ఆయన వెల్లడించారు. తొలగించిన 2.89 కోట్ల మందిలో 46 లక్షల మంది మరణించారని, 2.17 కోట్ల మంది ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లారని, 25.47 లక్షల మంది ఒకటి కంటే ఎక్కువచోట్ల ఓటర్లుగా నమోదు చేసుకున్నారని అధికారులు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణకు ముందు ఉత్తరప్రదేశ్‌లో 15.44 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వివిధ కారణాల వల్ల ఓటర్ల తొలగింపుల అనంతరం ఆ సంఖ్య 12.56 కోట్లకు తగ్గింది. ఓటర్లు తమ పేరు ముసాయిదా జాబితాలో ఉందో లేదో యాప్ ద్వారా లేదా ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు. ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ విధానాల్లో అభ్యంతరాలను స్వీకరిస్తామని, వాటిని పరిష్కరించిన తర్వాత తుది జాబితాను మార్చి 6న విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

# దమ్ముంటే వచ్చి నన్ను పట్టుకో

**ట్రంప్‌కు కొలంబియా అధ్యక్షుడి సవాల్**



వాషింగ్టన్: వాషింగ్టన్, బొగొటా మధ్య ఉద్రిక్తతలు శరవేగంగా పెరుగుతున్నాయి. వెనిజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా దళాలు అదుపులోకి తీసుకున్న కొన్ని రోజులకే ఇప్పుడు కొలంబియా వంతు వచ్చిందన్నట్లుగా పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తీవ్ర వ్యాఖ్యలకు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఏకంగా "నన్ను వచ్చి పట్టుకో. నేను ఇక్కడే ఎదురుచూస్తున్నా" అంటూ బహిరంగ సవాల్ విసిరారు. గత వారాంతంలో మదురో అరెస్ట్‌ను ఓ పెద్ద విజయంగా అభివర్ణించిన ట్రంప్, ఇప్పుడు తన దృష్టిని కొలంబియా వైపు మళ్లించారు. కొలంబియా కూడా 'చాలా అనారోగ్యంతో' ఉందని, 'కొకైన్ తయారుచేసి అమెరికాకు అమ్మే ఓ అనారోగ్యకర వ్యక్తి' దేశాన్ని నడిపిస్తున్నారని పెట్రోను ఉద్దేశించి తీవ్రంగా విమర్శించారు. "అతనికి కొకైన్ మిల్లులు, ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఇదంతా ఎక్కువ కాలం సాగదు" అని ట్రంప్ హెచ్చరించారు. కొలంబియాలో కూడా అమెరికా ఆపరేషన్ ఉంటుందా? అని విలేకరులు అడగ్గా, "నాకు ఇది మంచి ఆలోచనలాగే ఉంది" అని బదులిచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలపై సోమవారం పెట్రో 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఘాటుగా స్పందించారు. మరోవైపు కొలంబియా విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. చర్చలు, సహకారం, పరస్పర గౌరవం ఆధారంగా ఇతర దేశాలతో సంబంధాలు కోరుకుంటున్నట్లు తెలిపింది. యాక్సియోస్ కథనం ప్రకారం ఈ పరిణామాలపై వైట్‌హౌస్ ప్రతినిధి అన్నా కెల్లీ స్పందించారు. ఈ ప్రాంతంలో అమెరికా పట్టు బిగించి, వలసలను, డ్రగ్స్ ప్రవాహాన్ని అరికట్టే భద్రతా ప్రణాళికలో ఈ చర్యలు భాగమేనని తెలిపారు. "ప్రతి ఏటా వేలాది మంది అమెరికన్ల మరణానికి కారణమవుతున్న మాదకద్రవ్యాల నుంచి వ మాతృభూమిని రక్షించుకోవడానికి అధ్యక్షుడి వద్ద అనేక మార్గాలున్నాయి" అని ఆమె పేర్కొన్నారు. గత అక్టోబర్‌లోనే డ్రగ్స్‌తో సంబంధాలున్నాయనే ఆరోపణలతో ట్రంప్... పెట్రో, ఆయన కుటుంబంపై ఆంక్షలు విధించారు. అయితే పెట్రో ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నారు. తన హయాంలో 'ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద కొకైన్ స్వాధీనం' జరిగిందని స్పష్టం చేస్తున్నారు. వెనిజువెలాలో జరిగిన ఆపరేషన్ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు కొలంబియాలో కూడా అలాంటి పరిస్థితి వస్తుందేమోనన్న ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి.

## పాక్‌కు టెలినార్ గుడ్‌బై

ఇస్లామాబాద్: తీవ్ర ఆర్థిక, రాజకీయ సంక్షోభంలో చిక్కుకున్న పాకిస్థాన్‌కు విదేశీ కంపెనీలు ఒక్కొక్కటిగా గుడ్ బై చెబుతున్నాయి. తాజాగా, నార్వేకు చెందిన టెలికాం దిగ్గజం టెలినార్ గ్రూప్.. పాకిస్థాన్‌లోని తన వ్యాపారాన్ని పూర్తిగా ముగించుకుని ఆ దేశం నుంచి వైదొలగింది. టెలినార్ పాకిస్థాన్‌ను స్థానిక పాకిస్థాన్ టెలికమ్యూనికేషన్ కంపెనీ లిమిటెడ్ కు విక్రయించే ప్రక్రియ పూర్తయినట్లు కంపెనీ అధికారికంగా ప్రకటించింది. 2023 డిసెంబర్‌లో ప్రకటించిన ఈ డీల్ విలువ 5.3 బిలియన్ నార్వేజియన్ క్రోనర్ గా ఉందని టెలినార్ తన ప్రకటనలో పేర్కొంది. పాకిస్థాన్‌లో వ్యాపార వాతావరణం అత్యంత క్లిష్టంగా మారడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో పాకిస్థాన్ నుంచి వైదొలగిన కంపెనీల జాబితాలో టెలినార్ కూడా చేరింది. అంతకుముందు ఖతార్‌కు చెందిన అల్ థానీ గ్రూప్, షెల్ పెట్రోలియం, ఫ్రెంచ్ ఆయిల్ దిగ్గజం టోటల్ ఎనర్జీస్ వంటి సంస్థలు కూడా పాక్‌ను వీడాయి. ప్రభుత్వం బకాయిలు సకాలంలో చెల్లించకపోవడం, పాకిస్థానీ రూపాయి విలువ పడిపోవడం వంటి కారణాలతో ఈ కంపెనీలు తమ కార్యకలాపాలను నిలిపివేస్తున్నాయి. చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ లో కీలకమైన పోర్ట్ ఖాసిం పవర్ ప్రాజెక్టు నుంచి అల్ థానీ గ్రూప్ తన వాటాను ఉపసంహరించుకుంది. ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 288 మిలియన్ల బకాయిలు పేరుకుపోవడమే దీనికి కారణమని యూకేకు చెందిన ఏషియన్ లైట్ వార్తాపత్రిక కథనం వెల్లడించింది. ఈ వరుస పరిణామాలు పాక్ ఆర్థిక వ్యవస్థను మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయి.

## రిలయన్స్ దెబ్బకు భారీ నష్టాలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా నష్టాల్లో ముగిశాయి. దిగ్గజ షేర్లయిన రిలయన్స్ ఇండస్ట్రీస్, ట్రెంట్ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి సూచీలపై తీవ్ర ప్రభావం చూపింది. రోజంతా మార్కెట్ సెంటిమెంట్ బలహీనంగానే కొనసాగింది మంగళవారం నాడు ట్రేడింగ్ ముగిసే సమయానికి, నిఫ్టీ 71.6 పాయింట్లు నష్టపోయి 26,178.70 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, సెన్సెక్స్ 376.28 పాయింట్లు పతనమై 85,063.34 వద్ద ముగిసింది. ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ సీఎల్ఎస్ఏ తన ఇండియా మోడల్ పోర్ట్‌ఫోలియో నుంచి రిలయన్స్‌ను తొలగించిందనే వార్తల నేపథ్యంలో, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు ఎనిమిది నెలల్లో ఎన్నడూ లేనంతగా ఇంట్రాడేలో 4 శాతానికి పైగా పడిపోయింది. మరోవైపు, ట్రెంట్ కంపెనీ విడుదల చేసిన మూడో త్రైమాసిక వ్యాపార అప్‌డేట్ ఇన్వెస్టర్లను నిరాశపరచడంతో ఆ కంపెనీ షేరు ఏకంగా 9 శాతం మేర కుప్పకూలింది. సెన్సెక్స్‌లో కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటివి కూడా నష్టపోయాయి. అయితే ఐసీఐసీఐ బ్యాంక్, సన్ ఫార్మా, హిందుస్థాన్ యూనిలీవర్, ఎస్‌బీఐ, టీసీఎస్ షేర్లు లాభాల్లో ముగిసి సూచీలకు కొంత మద్దతునిచ్చాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ బలహీనత కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.19 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.22 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 1.75% పతనంతో అత్యధికంగా నష్టపోయింది. మరోవైపు, హెల్త్‌కేర్, ఫార్మా రంగ షేర్లు రాణించాయి. ఇదిలా ఉండగా, వరుసగా నాలుగు రోజుల పతనం తర్వాత భారత రూపాయి, డాలర్‌తో పోలిస్తే బలపడింది. ఫారెక్స్ నిపుణుల ప్రకారం, స్పాట్ యూఎస్‌డీఐఎన్ఆర్ 89.90 స్థాయికి పైన ఉన్నంతవరకు ట్రెండ్ న్యూట్రల్‌గా లేదా బుల్లిష్‌గా ఉండే అవకాశం ఉంది.

## నేపాల్ సరిహద్దు మూసివేత

న్యూఢిల్లీ: హిమాలయ దేశం నేపాల్‌లో మతపరమైన ఘర్షణలు చెలరేగాయి. ధనుశా జిల్లాలో ఒక ప్రార్థనా స్థలంపై కొందరు దాడికి పాల్పడి, ధ్వంసం చేశారు. దీనిని సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆందోళనలు చెలరేగాయి. రాహౌల్, పర్సా ప్రాంతాల్లో ఆందోళకారులు నిరసనలకు దిగారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పెద్ద సంఖ్యలో భద్రతాదళాలు రంగంలోకి దిగాయి. కొన్ని చోట్ల పరిస్థితి హింసాత్మకంగా మారడంతో స్థానిక యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో భారత ప్రభుత్వం అలర్ట్ అయింది. నేపాల్ తో సరిహద్దును మూసేసింది. ఎమర్జెన్సీ సేవలు మినహా, రాకపోకలను బంద్ చేసింది.

## విజయ్‌కు సీబీఐ నోటీసులు

చెన్నై: కరూర్ తొక్కిసలాట కేసులో టీవీకే అధినేత, ప్రముఖ నటుడు విజయ్‌కు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 12న ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో పేర్కొంది. ఈ ఘటనపై సీబీఐ విచారణ కొనసాగుతోంది. గత ఏడాది సెప్టెంబర్ 27న తమిళనాడులోని కరూర్‌లో విజయ్ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతి చెందగా, 60 మంది గాయపడిన విషయం తెలిసిందే. సుమారు 10 వేల మంది సామర్థ్యం కలిగిన సభాస్థలి వద్దకు దాదాపు 30,000 మంది రావడంతో తొక్కిసలాట జరిగింది. అంతేకాకుండా, విజయ్ బహిరంగ సభ వేదిక వద్ద భద్రతా మార్గదర్శకాలను ఉల్లంఘించారని, సభకు హాజరైన వారికి సరైన ఆహారం, నీటి వసతులు కల్పించలేదని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సీబీఐ ఆయనకు నోటీసులు జారీ చేసింది.

## ఐదేళ్లూ సిద్దూనే సీఎం : డీకే

మైసూర్: కర్ణాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. తాను పూర్తికాలం సీఎంగా కొనసాగుతానో? లేదో? పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని సీఎం సిద్ధరామయ్య స్వయంగా చెప్పారు. మంగళవారం మైసూరులో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "నా పదవీకాలం పూర్తిచేస్తానా? లేదా? అన్నది అధిష్ఠానం నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. అధిష్ఠానంపై నాకు పూర్తి నమ్మకం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. గతంలో తాను ఐదేళ్లు సీఎంగా ఉంటానని ధీమా వ్యక్తం చేసిన సిద్ధరామయ్య, ఇప్పుడు ఇలా మాట్లాడటం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈరోజే బెంగళూరులో మాట్లాడిన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా ఆసక్తికరంగా స్పందించారు. సిద్ధరామయ్య తన ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకోవాలని తాను కోరుకుంటున్నానని తెలిపారు. "ఆయనకు అంతా మంచే జరగాలి. మా మధ్య ఎలాంటి గందరగోళం లేదు. అదంతా మీడియా సృష్టి. ఆయన మరిన్ని విజయాలు సాధించాలి" అని శివకుమార్ ఆకాంక్షించారు. ఇటీవల బళ్లారిలో జరిగిన ఘర్షణల గురించి ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో శాంతి భద్రతలకు బీజేపీ భంగం కలిగిస్తోందని ఆరోపించారు. మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ రూ. 25 లక్షల పరిహారం నగదు రూపంలో ఇవ్వడంపై వచ్చిన ఆరోపణల గురించి ఆయనతో మాట్లాడతానని చెప్పారు. సోనియా గాంధీ ఆసుపత్రిలో చేరడంపై స్పందిస్తూ, ఆమె త్వరగా కోలుకోవాలని, దేశానికి, పార్టీకి ఆమె మార్గనిర్దేశం ఎంతో అవసరమని శివకుమార్ ఆకాంక్షించారు.

## ట్రంప్ వల్ల నాటో నాశనం

**గ్రీన్ ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటే జరిగేది అదే**

**డెన్మార్క్ పీఎం ఫ్రెడెరిక్సన్ మండిపాటు**

వాషింగ్టన్: వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను యూఎస్ డెల్టా ఫోర్సెస్ బందీ చేసి అమెరికాకు తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వారిద్దరూ అమెరికాలోని డిటెన్షన్ సెంటర్ లో ఉన్నారు. వెనెజువెలా తర్వాత ఇప్పుడు గ్రీన్‌లాండ్ పేరు మళ్లీ చర్చనీయాంశంగా మారింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ "గ్రీన్‌లాండ్ మనకు జాతీయ భద్రత కోసం అవసరం" అని మరోసారి చెప్పారు. "ఇంకో 20 రోజుల్లో గ్రీన్‌లాండ్ గురించి మాట్లాడదాం" అంటూ మరో రచ్చకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో డెన్మార్క్ ప్రధాని మెటె ఫ్రెడెరిక్సన్ తీవ్రంగా స్పందించారు. "అమెరికా గ్రీన్‌లాండ్‌ను తీసుకోవాలని మాట్లాడటం అర్థరహితం. మా రాజ్యంలోని ఏ భాగాన్నీ అమెరికా ఆక్రమించే హక్కు లేదు" అని స్టేట్‌మెంట్ ఇచ్చారు. మరీ తీవ్రంగా, "అమెరికా నాటో సభ్య దేశంపై దాడి చేస్తే అంతా ఆగిపోతుంది... నాటో కూడా ముగిసిపోతుంది" అని వార్నింగ్ ఇచ్చారు. కలకలం రేపిన మరో విషయం ఏమిటంటే... ట్రంప్ సీనియర్ అడ్వైజర్ స్టీఫెన్ మిల్లర్ భార్య కేటీ మిల్లర్ సోషల్ మీడియాలో గ్రీన్‌లాండ్ మ్యాప్‌ను అమెరికన్ ఫ్లాగ్ రంగుల్లో పోస్ట్ చేసి త్వరలో అని క్యాప్షన్ పెట్టారు.

## వయ్యారి చిత్రం



ఫరియా అబ్దుల్లా



## ప్రభుత్వాలతో చిరు చర్చలు!

### సంక్రాంతి తర్వాత రంగంలోకి

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి మరోసారి సినీ పరిశ్రమకు సంబంధించిన కీలక సమస్యపై చొరవ తీసుకోనున్నారు. థియేటర్లలో టికెట్ ధరలు, ఆహార పదార్థాల ధరలపై నెలకొన్న వివాదాలు, అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆ అంశాన్ని సీరియస్ గా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో చిరంజీవి.. సంక్రాంతి పండుగ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరపనున్నట్లు నిర్మాత సాహు గారపాటి వెల్లడించారు. ప్రస్తుతం చిరంజీవితో ఆయన మన శంకర వరప్రసాద్ గారు మూవీని రూపొందిస్తున్న విషయం తెలిసిందే. సంక్రాంతి కానుకగా ఆ సినిమా జనవరి 14వ తేదీన విడుదల అవ్వనుంది. దీంతో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సాహు గారపాటి, థియేటర్లలో అమలవుతున్న అధిక టికెట్ ధరలు, పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ వంటి ఫుడ్ ఐటమ్స్ ధరల విషయంలో చిరంజీవి ప్రత్యేకంగా దృష్టి పెట్టారని తెలిపారు. ఆ సమస్యలు సాధారణ ప్రేక్షకులపై చాలా భారం అవుతున్నాయని చిరంజీవి అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. అయితే సంక్రాంతి పండుగ సీజన్ పూర్తయిన వెంటనే చిరంజీవి ప్రభుత్వాలతో భేటీ అవుతారని సాహు గారపాటి స్పష్టం చేశారు. సినీ పరిశ్రమకు, ప్రేక్షకులకు ఇద్దరికీ న్యాయం జరిగేలా పరిష్కారం కనుగొనడమే చిరంజీవి లక్ష్యమని అన్నారు.

## జన నాయగన్.. విజయ్‌కు సెన్సార్ బోర్డు షాక్!

తమిళ స్టార్ విజయ్ చివరి చిత్రం 'జన నాయగన్' విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ నెల 9న సినిమా విడుదల కావాల్సి ఉంది. కానీ ఇప్పుడు రిలీజ్‌పై పెద్ద అనుమానాలు రేగాయి. సెన్సార్ బోర్డు నుంచి ఇంకా సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడమే దీనికి కారణం. రిలీజ్‌కి కేవలం 3 రోజులే ఉన్న తరుణంలో ఈ జాప్యం కోలీవుడ్‌లో సంచలనం రేపింది. విజయ్ అభిమానులు తీవ్ర ఉత్కంఠలో ఉన్నారు. డిసెంబర్ 18న సినిమాను సెన్సార్ బోర్డుకు సమర్పించారు. బోర్డు కొన్ని మైనర్ కట్స్, డైలాగ్ మ్యూట్లు సజెస్ట్ చేసింది. నిర్మాతలు వెంటనే అంగీకరించి మార్పులు చేసి మళ్లీ సబ్మిట్ చేశారు. అయినా సర్టిఫికెట్ ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. దీని వెనుక రాజకీయ కారణాలు ఉండవచ్చని విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం వర్గాలు ఆరోపిస్తున్నాయి. టీవీకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీటీ నిర్మల్ కుమార్ మాట్లాడితే... 'కొన్ని గంటల్లో సర్టిఫికెట్ రాకపోతే తదుపరి చర్యలు తీసుకుంటాం' అంటూ వార్నింగ్ ఇచ్చారు. ఈ




జాప్యం వల్ల తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో అడ్వాన్స్ బుకింగ్స్ నిలిచిపోయాయి. కర్ణాటక, కేరళ, ఓవర్సీస్‌లో మాత్రం బుకింగ్స్ స్టార్ట్ అయ్యాయి. ఇప్పటికే ప్రీ-సేల్స్ రూ.35 కోట్లు దాటాయి. సర్టిఫికేట్ లేకపోతే థియేటర్లలో షోలు పడవు. నిర్మాతలకు భారీ నష్టం వాటిల్లుతుంది. చివరికి నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. ఎమర్జెన్సీ పిటిషన్ దాఖలు చేసి, సర్టిఫికెట్ వెంటనే ఇవ్వాలని కోర్టును కోరారు. కోర్టు నుంచి సానుకూల నిర్ణయం వస్తే రేపటి నుంచి బుకింగ్స్ ఊపందుకుంటాయి, అనుకున్న సమయానికి సినిమా రిలీజ్ అవుతుంది.

## హైకోర్టుకు రాజాసాబ్, ఎంఎస్‌జీ నిర్మాతలు

సంక్రాంతికి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైన 'మన శంకరవరప్రసాద్', 'రాజా సాబ్' చిత్రాల ప్రత్యేక షోల అనుమతి కోసం నిర్మాతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ మంగళవారు ఈ రెండు సినిమాల ప్రొడ్యూసర్స్ అప్పీల్ చేశారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని, టికెట్ ధర పెంపు, ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వాలని రాజా సాబ్ నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, క్రితి ప్రసాద్.. మన శంకర వరప్రసాద్ నిర్మాతలు సుష్మిత కొణిదెల, సాహు గరపాటిలు అభ్యర్థించారు. తమ అప్పీల్‌ను అత్యవసర పిటిషన్ కింద విచారణకు స్వీకరించాలని కోరారు. నిర్మాతల అప్పీల్‌పై బుధవారం హైకోర్టు విచారించనుంది. నిరుడు 'సంక్రాంతికి వస్తున్నాం'తో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన అనిల్ రావిపూడి ఈసారి మన శంకర వరప్రసాద్ గారు చిత్రంతో వస్తున్నాడు. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా జనవరి 12వ తేదీన విడుదల కానుంది. ఇక పాన్ ఇండియా హీరోగా ఇప్పటికే నిరూపించుకున్న రెబల్‌స్టార్ ప్రభాస్‌తో ఫాంటసీ హర్రర్ కామెడీ సినిమాగా రాజా సాబ్‌ను తెరకెక్కించారు మారుతి. మాళవికా మోహనన్, నిధి అగ్వాల్, రిద్ది కుమార్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ సినిమా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## ఎంఎస్‌జీ సెన్సార్ రిపోర్ట్!

చిరు సినిమా మన శంకర వరప్రసాద్‌గారు ఈ నెల 12న భారీ స్థాయిలో రిలీజ్‌కు రెడీ అవుతూ సంక్రాంతి బరిలో నిలిచింది. మెగాస్టార్‌తో కలిసి వెంకీ మామ కూడా రంగంలోకి దిగడంతో ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇందులో విక్టరీ వెంకటేష్ కీలక అతిథి పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. రీసెంట్‌గా చిరు, వెంకటేష్‌లపై చిత్రీకరించిన మాస్ సాంగ్‌ని విడుదల చేశారు. ఇది ప్రస్తుతం నెట్టింట రచ్చ చేస్తోంది. ఈ వేళ సెన్సార్ రిపోర్ట్ వచ్చేసింది. ఇన్ సైడ్ టాక్ ప్రకారం రిపోర్ట్ అదిరిపోయిందనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. చిరుతో కలిసి వెంకటేష్ కనిపించే సన్నివేశాలు సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయని తెలుస్తోంది. చిరు – అనిల్ కలిసి ప్రాజెక్ట్ మొదలు పెడుతున్నారనే వార్త బయటికి వచ్చిన దగ్గరి నుంచే ఈ మూవీపై పాజిటీవ్ టాక్ మొదలైంది. తాజా సెన్సార్ రిపోర్ట్ ప్రకారం ఆ పాజిటివ్ వైబ్స్ మరింతగా పెరిగినట్టుగా ఇన్ సైడ్ టాక్. చిరు, వెంకటేష్ కలిసి తొలి సారి చేసిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఓ రేంజ్‌లో రచ్చ చేయబోతోందని తెలుస్తోంది. దీంతో సినీ లవర్స్, ఫ్యాన్స్ బిగ్ స్క్రీన్ మ్యాజిక్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



## రాజా సాబ్ సెన్సార్ పూర్తి

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా వస్తున్న తాజా సినిమా ది రాజా సాబ్. ఈ రోజుల్లో, ప్రేమ కథా చిత్రమ్, భలే భలే మగాడివోయ్ ఫేమ్ మారుతి ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. హార్రర్ కామెడీ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ భారీ బడ్జెట్ తో నిర్మించగా, ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే రాజా సాబ్ సినిమా నుంచి వచ్చిన పోస్టర్లు, టీజర్, సాంగ్స్, ట్రైలర్లకు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటికే షూటింగ్ ను పూర్తి చేసుకుని రిలీజ్ కు రెడీ అయిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ది రాజా సాబ్ సినిమా జనవరి 9న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలోకి రానుండగా, రిలీజ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో సినిమా సెన్సార్ కార్యక్రమాల్ని పూర్తి చేసుకుంది. సెన్సార్ పూర్తి చేసుకున్న ది


## నేను లక్కీ: మీనాక్షి



మీనాక్షి చౌదరి తాజా చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రావడానికి అనగనగా ఒక రాజు సిద్ధమైంది. సంక్రాంతి కానుకగా జనవరి 14వ తేదీన థియేటర్లలో దిగిపోనుంది. నవీన్ పోలిశెట్టి జోడీగా ఆమె నటించిన సినిమా ఇది. గత ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో హిట్ అందుకున్న మీనాక్షి చౌదరి, ఈ ఏడాది మరో సినిమాతో రంగంలోకి దిగుతుండటం విశేషం. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్స్ తో ఆమె బీజీగా ఉన్నారు. తాజా ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ .. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో గోదావరి జిల్లాలలో సంక్రాంతి ఎలా జరుగుతుందనేది నాకు అర్థమైంది. అలాగే ఈ ప్రాంతంలో సినిమాల పట్ల ఎంత క్రేజ్ ఉంటుందనేది కూడా నేను గమనించాను.

## ఉస్తాద్‌లో చాన్స్ మిస్సయ్యా

ఏజెంట్, గాండీవధారి అర్జున సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది సాక్షి వైద్య. ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశనే మిగిల్చాయి. సాక్షి వైద్య ఇక ఎలాగైనా హిట్టు కొట్టాలని ఈ సారి శర్వానంద్‌తో కలిసి నారి నారి నడుమ మురారి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ మూవీ జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో ఆసక్తికర విషయాన్ని షేర్ చేసుకుంది సాక్షి వైద్య. ఈ భామ ముందుగా పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో పోషిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్‌లో అవకాశం కొట్టేసిన విషయం తెలిసిందే. అయితే అనుకోకుండా ఈ ఛాన్స్ రాశీఖన్నా చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇదే విషయంపై సాక్షి వైద్య మాట్లాడుతూ.. ఉస్తాద్ భగత్ సింగ్ కోసం వారంపాటు షూటింగ్‌లో కూడా పాల్గొన్నా. కానీ ముందుగా తీసుకున్న కమిట్‌మెంట్స్, డేట్ల సర్దుబాటు కారణంగా అనుకోకుండా పవన్ కల్యాణ్‌తో కలిసి నటించే అవకాశం మిస్సయానంటూ చెప్పుకొచ్చింది సాక్షి వైద్య. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఒకవేళ ఉస్తాద్ భగత్ సింగ్ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోకుండా ఉంటే ఈ మూవీ సాక్షి వైద్య కెరీర్‌కు ప్లస్ అయి ఉండేదనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి రానున్న రోజుల్లో సాక్షి వైద్య, పవన్ కల్యాణ్ కాంబో రిపీట్ అవుతుందేమో చూడాలి.






# భారత అంధ మహిళల జట్టుకు నీతా అంబానీ 5 కోట్లు

రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ చారిత్రక విజయం సాధించిన భారత అంధ మహిళల క్రికెట్ జట్టుకు భారీ నజరానా ప్రకటించారు. తొలిసారి జరిగిన అంధుల టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకున్న జట్టుకు ఫౌండేషన్ తరపున రూ.5 కోట్ల ప్రోత్సాహకాన్ని అందజేశారు. వారి అద్భుతమైన స్ఫూర్తిని, పట్టుదలను కొనియాడారు. ముంబైలో 'యునైటెడ్ ఇన్ ట్రయంఫ్' పేరుతో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో నీతా అంబానీ స్వయంగా జట్టుకు రూ.5 కోట్ల చెక్కును అందించారు. ఈ వేదికపై మూడు ప్రపంచకప్ విజేత జట్లను ఒకేచోట సత్కరించడం విశేషం. అంధ మహిళల జట్టు కెప్టెన్ దీపికతో పాటు, టీ20 ప్రపంచకప్ 2024 గెలిచిన పురుషుల జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, వన్డే ప్రపంచకప్ 2025 విజేతగా నిలిచిన మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నీతా అంబానీ మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. "నూతన సంవత్సరాన్ని ఒక ప్రత్యేకమైన సందర్భంతో ప్రారంభిస్తున్నాం. మూడు భారత క్రికెట్ జట్లు ఒకే గూటి కిందకు రావడం చాలా ఆనందంగా ఉంది. ప్రతి భారతీయుడి తరపున వారికి ధన్యవాదాలు తెలుపుతూ, వారి విజయాలను వేడుకగా జరుపుకుంటున్నాం" అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమానికి రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, బాలీవుడ్ దిగ్గజం అమితాబ్ బచ్చన్, క్రికెట్ ఐకాన్ సచిన్ టెండూల్కర్, ఐసీసీ ఛైర్మన్ జై షాతో పాటు పలువురు సినీ, క్రీడా ప్రముఖులు పాల్గొన్నారు. తమకు అండగా నిలిచినందుకు నీతా అంబానీకి అంధ మహిళా క్రికెటర్లు కృతజ్ఞతలు తెలిపారు.




## గుజరాత్ ఫీల్డింగ్ కోచ్‌గా సారా టేలర్

మహిళల ప్రీమియర్ లీగ్‌లో టైటిల్ కోసం నిరీక్షిస్తున్న గుజరాత్ జెయింట్స్ కోచింగ్ యూనిట్‌ను బలోపేతం చేసుకుంటోంది. ఈసారి కప్పు కొట్టమే లక్ష్యంగా పెట్టుకున్న గుజరాత్ కొత్త ఫీల్డింగ్ కోచ్‌ను నియమించుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో సుదీర్ఘ అనుభవమున్న ఇంగ్లండ్ వెటరన్ సారా టేలర్‌కు ఫీల్డింగ్ ప్రమాణాలు మెరుగుపరిచే బాధ్యత అప్పగించింది. ఈ విషయాన్ని మంగళవారం ఎక్స్ వేదికగా ఫ్రాంచైజీ ప్రకటించింది. ఒకప్పుడు వికెట్‌కీపింగ్‌లో అదరగొట్టి మహిళా క్రికెట్‌లో ఎంఎస్ ధోనీగా కితాబులందుకుంది సారా టేలర్. ఆమె తన13 ఏళ్ల కెరీర్‌కు 2019లో వీడ్కోలు పలికింది. అనంతరం కోచ్‌గా అవతారమెత్తిన తను కౌంటీల్లో ఇంగ్లండ్ సీనియర్ జట్టుకు సేవలందించింది. జూనియర్ టీమ్ ఇంగ్లండ్ లయన్స్‌కు కోచింగ్ ఇచ్చిన సారా ఫీల్డింగ్ ప్రమాణాలు నెలకొల్పింది. దాంతో.. డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ కోసం ఆమెను గుజరాత్ జెయింట్స్ యాజమాన్యం సంప్రదించింది. 'సీజన్‌లో తొలి మ్యాచ్‌కు గుజరాత్ ప్లేయర్లను సిద్ధం చేయడంపై దృష్టి సారిస్తున్నా. మైదానంలో వారు తమ ఆటను ఆస్వాదిస్తూనే.. దూకుడు కనబరిచేలా చూస్తాను. మ్యాచ్‌లో గెలవడం, ఓడడం అనేది ఫీల్డింగ్ మీద ఆధారపడి ఉంటుంది. క్యాచ్‌లు పట్టడం, రనౌట్ చేయడం వంటివి మ్యాచ్‌ను మలుపు తిప్పుతాయి. కాబట్టి.. గుజరాత్ స్క్వాడ్‌లోని క్రికెటర్లు మైదానంలో చురుకుగా ఉండేలా శిక్షణ ఇస్తాను' అని టేలర్ వెల్లడించింది. హెడ్‌కోచ్ మైఖేల్ క్లింగర్, బౌలింగ్ కోచ్ ప్రవీణ్ తంబే, అనలిస్ట్ సౌరభ్ వాల్కర్‌తో కలిసి సారా గుజరాత్ టైటిల్ కలను సాకారం చేసేందుకు కృషి చేయనుంది.

## సురేశ్ కల్మాడీ కన్నుమూత



సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర మంత్రి, భారత ఒలింపిక్ సంఘం మాజీ అధ్యక్షుడు సురేశ్ కల్మాడీ కన్నుమూశారు. ఆయన వయసు 81 ఏళ్లు. పుణెలో ఆయన తుది శ్వాస విడిచారు. సుదీర్ఘకాలం నుంచి ఆయన తీవ్ర అనారోగ్యంగా ఉన్నారు. పుణెలోని దీనానాథ్ మంగేస్కర్ ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందారు.

# వన్డే కెప్టెన్‌గా అయ్యర్!



వన్డే వరల్డ్ కప్ వస్తున్న నేపథ్యంలో బీసీసీఐ కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అతి త్వరలోనే భారత జట్టు వన్డే కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ పేరును ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది కాలంగా వన్డే కెప్టెన్ గిల్ ప్రదర్శన అత్యంత దారుణంగా ఉంది. ఎన్ని అవకాశాలు ఇచ్చినా కూడా మెరుగు పడడం లేదు. దానికి తోడు వరుసగా గిల్ గాయాల బారిన పడుతున్నాడు. ఇప్పటికే టి20 ప్రపంచ కప్ నుంచి తప్పించిన బీసీసీఐ, అటు వన్డే వరల్డ్ కప్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి కూడా అతన్ని తొలగించాలని అనుకుంటోందట. కేవలం టెస్టుల్లో అతనికి కెప్టెన్సీ కొనసాగించాలని బీసీసీఐ ఓ నిర్ణయానికి వచ్చిందట. గిల్ స్థానంలో శ్రేయాస్ అయ్యర్ వన్డే కెప్టెన్ అవుతాడని అంటున్నారు. అతని కెప్టెన్సీ లోని 2027 వన్డే వరల్డ్ కప్ ఆడనుందట భారత జట్టు. అంతేకాదు సీనియర్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి కూడా అవకాశం ఇవ్వాలని బీసీసీఐ ఇప్పటికే నిర్ణయం తీసుకుందట. ఎవరు అవునన్నా? కాదన్నా? ఆ ఇద్దరు సీనియర్ ప్లేయర్లు వరల్డ్ కప్ జట్టులో ఉంటారని చెబుతుందట.




## విజయ్ హజారే ట్రోఫీలోనూ గిల్ వైఫల్యం

**అర్ధశతకంతో మెరిసిన అయ్యర్**

ఫామ్ లేమితో బాధపడుతున్న శుభ్‌మన్ గిల్ మళ్లీ నిరాశ పరిచాడు. న్యూజిలాండ్ సిరీస్‌కు ముందు టచ్‌లోకి రావాలని దేశవాళీ క్రికెట్ ఆడుతున్న గిల్.. అక్కడా స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగాడు. వన్డే ఫార్మాట్లో జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో భారత కెప్టెన్ 11 పరుగులకే ఔటయ్యాడు. గోవా బౌలర్ల వ్యూహాలకు గిల్ చేతులెత్తేయగా.. పునరాగమనంలో అదరగొడుతూ ముంబైకి సారథి శ్రేయాస్ అయ్యర్ అర్ధ శతకంతో రాణించాడు. నిరుడు టెస్టులు, వన్డే, టీ20ల్లో శతకాలతో హోరెత్తించిన శుభ్‌మన్ గిల్ ఇప్పుడు ఫామ్ కోసం తంటాలు పడుతున్నాడు. మెడ గాయం నుంచి కోలుకొని దక్షిణాఫ్రికాతో టీ20లు ఆడిన అతడు పెద్ద స్కోర్ చేయలేకపోయాడు. దాంతో.. స్వదేశంలో ఫిబ్రవరిలో జరుగబోయే పొట్టి ప్రపంచకప్ స్క్వాడ్‌లోకి అతడని సెలెక్టర్లు తీసుకోలేదు. దాంతో.. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లోపు ఎలాగైనా లయ అందుకోవాలనుకున్న గిల్ విజయ్ హజారే ట్రోఫీలోనూ ఉసూరుమనిపించాడు.

## యాషెస్‌లో స్మిత్ సెంచరీ

ఆసీస్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ యాషెస్ సిరీస్‌లో అరుదైన రికార్డుకు చేరువయ్యాడు. సిడ్నీ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో 13వ సారి ఈ సిరీస్‌లో మూడంకెల స్కోర్ అందుకున్నాడతడు. తద్వారా ఈ సిరీస్ చరిత్రలో రెండో అత్యధిక పరుగుల వీరుడిగా అవతరించాడు. ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ జాక్ హాబ్స్ రికార్డును బ్రేక్ చేశాడు స్మిత్. ఇక పరుగుల పరంగా ఆ



దేశ దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్‌కు మరింత చేరువయ్యాడీ సొగసరి బ్యాటర్. స్వదేశంలో జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో స్టీవ్ స్మిత్ రికార్డుల మోత మోగించాడు. 'ఒకే దెబ్బకు రెండు పిట్టలు' అన్నట్టు ఈ సిరీస్‌లో రెండో అత్యధిక సెంచరీలు నమోదు చేశాడు. రెండో అత్యధిక పరుగుల మైలురాయిని అధిగమించాడీ రన్ మెషీన్. ప్రస్తుతం స్మిత్ ఖాతాలో 3,682 పరుగులు ఉన్నాయి. యాషెస్‌లో టాప్ స్కోరర్ జాబితాలో డాన్ బ్రాడ్‌మన్ 5,028 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. ప్రతిష్టాత్మక ఈ సిరీస్‌లో బ్రాడ్‌మన్ 19 శతకాలతో టాప్‌లో ఉండగా.. స్మిత్ 13 సెంచరీలతో రెండో ర్యాంకుకు ఎగబాకాడు. ఉన్నాడు. ఆసీస్ మాజీ కెప్టెన్ స్టీవ్ వా పది సెంచరీలు, వాల్లీ హమాండ్ 9, డేవిడ్ గ్రోవర్ 9 సెంచరీలతో ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు.

## టీమిండియా కోచ్ అంటే ఈజీ కాదు: హర్భజన్ సింగ్



టీమ్‌ఇండియాకు ప్రస్తుతం మూడు ఫార్మాట్లలో గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా ఉన్నాడు. గౌతీ మార్గదర్శకత్వంలో పరిమిత ఓవర్ల క్రికెట్‌లో భారత జట్టు మెరుగైన ఫలితాలే సాధించింది. టెస్టుల్లో మాత్రం పేలవ ప్రదర్శన చేసింది. న్యూజిలాండ్, సౌతాఫ్రికా చేతిలో స్వదేశంలోనే వైట్‌వాష్‌కు గురైంది. ఈ క్రమంలో టెస్టులు, పరిమిత ఓవర్ల క్రికెట్‌కు వేర్వేరుగా కోచ్‌లను నియమించాలనే చర్చ జరుగుతోంది. ఇంగ్లాండ్, సౌతాఫ్రికా, పాకిస్థాన్ ఇప్పటికే ఈ విధానాన్ని అనుసరిస్తున్నాయి. భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ కూడా ఈ ఆలోచనను సమర్థించాడు. 'టీమ్‌ఇండియా కోచ్‌గా ఉండటం అంత సులభం కాదు. కోచ్‌గా ఉండాలంటే మీరు జట్టుతో ఏడాది పాటు ప్రయాణించాలి. వేర్వేరు ఫార్మాట్లకు జట్లను ఎంపిక చేయాల్సి ఉన్నందున ఎల్లప్పుడూ ఆటగాళ్ల ప్రదర్శనను గమనిస్తూ ఉండాలి. మ్యాచ్ ఫలితాలపై కూడా దృష్టి పెట్టాలి. గౌతమ్ గంభీర్ మైదానంలోకి వెళ్లి ఆడడు. ఎప్పుడు ఎలా ఆడాలో మాత్రమే చెప్తాడు. క్రికెటర్‌గా కొనసాగినప్పుడు అతను బాగా ఆడాడు. భారత్ తరఫున అద్భుతమైన ప్రదర్శనలు చేశాడు. ప్రతి ఒక్కరూ ఓపిక పట్టాలి. వైట్‌బాల్ క్రికెట్, టెస్టులకు ఇప్పుడు వేర్వేరుగా కోచ్‌లు అవసరం లేదు. కాలక్రమేణా అవసరమైతే ఈ విధానాన్ని అనుసరించవచ్చు. అందులో తప్పేమీ లేదు' అని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు.

## అమన్ రావ్ డబుల్ సెంచరీ


**దుమ్మురేపిన హైదరాబాదీ బ్యాటర్**

విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాదీ బ్యాటర్ అమన్ రావ్ దుమ్మురేపాడు. డబుల్ సెంచరీతో హడలెత్తించాడు. బెంగాల్‌తో రాజ్‌కోట్‌లో జరిగిన మ్యాచ్‌లో బౌండరీలో మోత మోగించాడు. కేవలం 154 బంతుల్లోనే అతను 200 పరుగులు చేశాడు. అతని డబుల్ సెంచరీలో 12 ఫోర్లు, 13 సిక్సర్లు ఉన్నాయి. అమెరికాలో పుట్టిన హైదరాబాదీ బ్యాటర్ అమన్ రావ్.. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు సొంతం చేసుకున్నది. అయితే లిస్ట్ ఏ మ్యాచుల్లో తొలి సారి అతను సెంచరీ చేశాడు. ఇది అతనికి కేవలం మూడో మ్యాచ్ మాత్రమే. షమీ, ఆకాశ్ దీప్, ముఖేశ్ కుమార్ లాంటి బలమైన బౌలర్లు ఉన్న బెంగాల్ జట్టుపై అమన్ రావ్ డబుల్ సెంచరీ కొట్టడం విశేషం. టాస్ గెలిచిన బెంగాల్ జట్టు.. హైదరాబాద్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. అయితే ఇన్నింగ్స్ ఆఖరి బంతికి సిక్సర్ కొట్టిన అమన్ రావు.. తన ఖాతాలో డబుల్ సెంచరీ వేసుకున్నాడు. ఆకాశ్ దీప్, షమీ, ముఖేశ్ బౌలింగ్‌లో అతను 120 రన్స్ స్కోరు చేశాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఈ సీజన్‌లో ఇది రెండో డబుల్ సెంచరీ. ఒడిశా బ్యాటర్ స్వస్తిక్ సమల్ కూడా డబుల్ సెంచరీ బాదిన విషయం తెలిసిందే.



ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం www.evarthalu.com
నేటి ఈవార్తలు
బుధవారం 7-1-2026

# వినాశనకారి.. ట్రంప్!



డొనాల్డ్ ట్రంప్ రెండో సారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ప్రపంచ రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తున్నాయి. ఆయన అనుసరిస్తున్న అమెరికా ఫస్ట్ విధానం, ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని లెక్కచేయని తీరు ప్రస్తుతం అంతర్జాతీయ సమాజంలో తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది. 2026 నాటి ప్రస్తుత పరిస్థితుల్లో, ట్రంప్ దూకుడు చర్యలు ప్రపంచ శాంతికి పెను సవాలుగా మారాయి. అగ్రరాజ్యపు అధిపతి అంటే ప్రపంచానికి దిశానిర్దేశం చేసే వ్యక్తిగా ఉండాలి. కానీ, డొనాల్డ్ ట్రంప్ తీరు అందుకు భిన్నంగా ఉంది. దేశాల మధ్య ఉండాల్సిన దౌత్యపరమైన మర్యాదలను పక్కనపెట్టి, కేవలం వ్యాపార దృక్పథంతో, బెదిరింపు ధోరణితో వ్యవహరించడం ఆయనకు అలవాటుగా మారింది. ఇది కేవలం ఒక దేశానికి సంబంధించిన సమస్య కాదు, యావత్ ప్రపంచ ఉనికికి సంబంధించిన ప్రశ్న. ట్రంప్ తన మొదటి దఫా నుండి నేటి వరకు టారిఫ్‌లను ఒక ఆయుధంగా వాడుకుంటున్నారు. చైనా, యూరప్ దేశాలు, చివరకు మిత్రదేశమైన భారత్‌పై కూడా భారీగా సుంకాలు విధించడం ద్వారా అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థను అతలాకుతలం చేశారు. స్వేచ్ఛా వాణిజ్యం అనే భావనను తుంగలో తొక్కి, రక్షణవాద ధోరణితో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మాంద్యం అంచున నిలబెట్టారు. ఈ ఆర్థిక యుద్ధం వల్ల పేద, మధ్యతరగతి దేశాల ఆర్థిక స్థితిగతులు ఛిన్నాభిన్నమవుతున్నాయి.

## దేశాల సార్వభౌమత్వంపై దాడి

వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా బలగాలు అపహరించడం, ఆ దేశంపై దాడులు చేయడంపై డొనాల్డ్ ట్రంప్ అనేక వాదనలతో తన చర్యలను సమర్థించుకుంటున్నారు. ఆయన ప్రధానంగా చట్ట అమలు, జాతీయ భద్రత, ఆర్థిక ప్రయోజనాలను సాకుగా చూపించారు. మదురో ప్రభుత్వం అమెరికాలోకి వేల టన్నుల కొకైన్‌ను సరఫరా చేస్తోందని, మదురో ఒక నార్కో-టెర్రరిస్ట్ అని ట్రంప్ ఆరోపించారు. ఈ దాడి కేవలం ఒక సైనిక చర్య మాత్రమే కాదని, అమెరికా చట్టాలను అమలు చేసే ఒకలా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆపరేషన్ అని అభివర్ణించారు. చారిత్రక మన్‌రో సిద్ధాంతాన్ని తనదైన శైలిలో డాన్రో సిద్ధాంతంగా మారుస్తూ ట్రంప్ సమర్థించుకుంటున్నారు. పశ్చిమ దేశాల భూభాగంలో అమెరికా ఆధిపత్యం తిరుగులేనిదని, తమ ప్రాంతంలోని సంక్షోభాలను పరిష్కరించే హక్కు తమకు ఉందని వాదిస్తున్నారు. అంతేకాకుండా, డెన్మార్క్‌కు చెందిన గ్రీన్ ల్యాండ్‌ను కొనుగోలు చేయాలనే ట్రంప్ ప్రతిపాదన అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. ఈ ప్రతిపాదనను డెన్మార్క్ ప్రభుత్వం వెంటనే తిరస్కరించింది. వాస్తవానికి ట్రంప్ ప్రతిపాదన అతడి అహంకారానికి పరాకాష్ట. ఒక దేశ భూభాగాన్ని రియల్ ఎస్టేట్ ముక్కలా భావించడం అంతర్జాతీయ చట్టాలను అవమానించడమే. ఆ ప్రాంతంపై దాడులు చేస్తామని లేదా బలవంతంగా స్వాధీనం చేసుకుంటామనే హెచ్చరికలు పంపడం ద్వారా ప్రపంచానికి ట్రంప్ ఒక ప్రమాదకరమైన సంకేతాన్ని ఇస్తున్నారు. ఇది ఇతర దేశాల ప్రాదేశిక సమగ్రతను కాలరాయడమే.

## తెంపరితనంతో ప్రమాదాలు

అంతర్జాతీయ ఒప్పందాల నుండి ఏకపక్షంగా వైదొలగడం ద్వారా అణు యుద్ధం వచ్చే అవకాశాలను ట్రంప్ పెంచుతున్నారు. పారిస్ వాతావరణ ఒప్పందం వంటి వాటిని పట్టించుకోకపోవడం వల్ల రాబోయే తరాలకు నివాసయోగ్యం కాని భూమిని మిగిల్చే ప్రమాదం ఉంది. నియంతృత్వ పోకడలు ఉన్న దేశాధినేతలతో స్నేహం చేస్తూ, ప్రజాస్వామ్య విలువలను బలహీనపరుస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ఈ అనూహ్యమైన దూకుడుతో కూడిన ధోరణి ప్రపంచ దేశాలను భయాందోళనకు గురిచేస్తోంది. అమెరికా వంటి శక్తివంతమైన దేశం బాధ్యతాయుతంగా వ్యవహరించకపోతే, అది మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీసే అవకాశం ఉంది. ప్రపంచ దేశాలు ఏకమై ఈ తెంపరితనాన్ని అడ్డుకోకపోతే, భవిష్యత్తులో అంతర్జాతీయ వ్యవస్థ కుప్పకూలడం ఖాయం. శాంతిని కాపాడాల్సిన చేతులే వినాశనానికి పూనుకోవడం నేటి కాలపు అతిపెద్ద విషాదం.



రణధీర్ గుండు



# పసిడి పరుగులు..
# ఆర్థిక అనిశ్చితి

భారతీయ సమాజంలో బంగారం అంటే కేవలం ఒక లోహం మాత్రమే కాదు; అది ఒక సెంటిమెంట్, సామాజిక హోదాకు చిహ్నం,, ఆపత్కాలంలో ఆదుకునే నిజమైన నేస్తం. అయితే, గత కొంతకాలంగా పసిడి ధరలు ఆకాశమే హద్దుగా పెరుగుతూ ఉండటం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 2024-25 కాలంలో ప్రారంభమైన ఈ పెరుగుదల ధోరణి, 2026 నాటికి సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఈ అసాధారణ ధరల పెరుగుదల వెనుక ఉన్న కారణాలు, అంతర్జాతీయ పరిణామాలు, ఇది సామాన్యుడిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. బంగారం ధర పెరగడానికి ప్రధాన కారణం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అస్థిరత.

చరిత్రను గమనిస్తే, ఎక్కడైనా యుద్ధం లేదా రాజకీయ అనిశ్చితి నెలకొన్నప్పుడు పెట్టుబడిదారులు షేర్ మార్కెట్ల కంటే బంగారం వైపే మొగ్గు చూపుతారు. దీన్నే సేఫ్ హెవెన్ పెట్టుబడిగా పిలుస్తారు. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, ఉక్రెయిన్-రష్యా వివాదం కొనసాగడం, తైవాన్ జలసంధిలో పెరుగుతున్న వేడి వంటి అంశాలు అంతర్జాతీయ మార్కెట్లో బంగారానికి డిమాండ్ పెంచాయి. 2026 నాటికి కూడా ఈ భౌగోళిక అనిశ్చితి కొనసాగుతుండటం పసిడి ధరకు రెక్కలు తొడిగింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులు (ముఖ్యంగా చైనా, భారత్, రష్యా) తమ విదేశీ మారక ద్రవ్య నిల్వలలో డాలర్ వాటాను తగ్గించుకుంటూ, బంగారాన్ని పెంచుకుంటున్నాయి. అమెరికా డాలర్ విలువలో వచ్చే హెచ్చుతగ్గుల నుండి తమ ఆర్థిక వ్యవస్థను రక్షించుకోవడానికి బ్యాంకులు చేస్తున్న ఈ డీ-డాలరైజేషన్ ప్రయత్నం వల్ల మార్కెట్లో బంగారం సరఫరా తగ్గి, ధరలు పెరుగుతున్నాయి. భారత రిజర్వ్ బ్యాంక్ కూడా గత రెండేళ్లుగా టన్నుల కొద్దీ బంగారాన్ని కొనుగోలు చేయడం గమనార్హం. ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు కరెన్సీ విలువ తగ్గుతుంది. ఆ సమయంలో కొనుగోలు శక్తిని కాపాడుకోవడానికి బంగారం ఉత్తమ సాధనంగా కనిపిస్తుంది. అలాగే, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించే సంకేతాలు ఇచ్చినప్పుడల్లా, పెట్టుబడిదారులు బాండ్ల నుండి పెట్టుబడులను ఉపసంహరించుకుని బంగారంలో పెడతారు. 2025 చివరి నాటికి అంతర్జాతీయంగా వడ్డీ రేట్ల తగ్గింపు ప్రక్రియ ప్రారంభం కావడం 2026లో బంగారం ధరలు చారిత్రాత్మక గరిష్ట స్థాయికి చేరడానికి మార్గం సుగమం చేసింది. భారతదేశం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారం వినియోగదారు. మనం వినియోగించే బంగారంలో సింహభాగం దిగుమతి చేసుకున్నదే. అంతర్జాతీయంగా బంగారం ధర పెరగడంతో పాటు, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ బలహీనపడటం మన దేశంలో ధరలు మరింత పెరగడానికి కారణమవుతోంది. దిగుమతి సుంకాలు, జీఎస్టీ ప్రభావం కూడా తోడై, అంతర్జాతీయ మార్కెట్ కంటే దేశీయ మార్కెట్‌లో తులం బంగారం ధర సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుతోంది. భారతదేశంలో బంగారం కొనుగోళ్లు సంస్కృతిలో భాగం. అక్షయ తృతీయ, ధన్తేరస్ వంటి పండుగలు, పెళ్లిళ్ల సీజన్లలో డిమాండ్ విపరీతంగా ఉంటుంది. ధర ఎంత ఉన్నా, సంప్రదాయం కోసం కొనుగోలు చేసే ధోరణి భారతీయులలో ఉంది. అయితే, ప్రస్తుత ధరల పెరుగుదల వల్ల మధ్యతరగతి ప్రజలు తమ కొనుగోలు పరిమాణాన్ని తగ్గించుకుంటున్నారు. ఇది ఆభరణాల రంగానికి పెద్ద సవాలుగా మారింది. భౌతిక బంగారం మాత్రమే కాకుండా, ఇప్పుడు డిజిటల్ బంగారం, గోల్డ్ ఈటీఎఫ్‌లు, సావరిన్ గోల్డ్ బాండ్లపై పెట్టుబడులు పెరిగాయి. లాకర్ల భయం లేకపోవడం, స్వచ్ఛతపై గ్యారంటీ ఉండటంతో యువత ఎక్కువగా వీటి వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పెట్టుబడుల పెరగడం కూడా మార్కెట్ రేటుపై ఒత్తిడి పెంచుతోంది. బంగారం ధర పెరగడం పెట్టుబడిదారులకు లాభదాయకమే అయినా, మధ్యతరగతి, పేద వర్గాలకు ఇది పెద్ద భారంగా మారింది. ముఖ్యంగా ఆడపిల్లల పెళ్లిళ్లు చేయాల్సిన తల్లిదండ్రులకు ఇది ఒక పీడకలగా మారుతోంది. పాత బంగారాన్ని రీసైకిల్ చేయడం లేదా తక్కువ బరువున్న ఆభరణాల వైపు మొగ్గు చూపడం వంటి మార్పులు మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. 2026లో బంగారం ధరల పెరుగుదల అనేది కేవలం తాత్కాలిక పరిణామం కాదు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులకు సంకేతం. భౌగోళిక రాజకీయ పరిస్థితులు సద్దుమణిగి, రూపాయి విలువ స్థిరీకరణ అయ్యే వరకు పసిడి ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం తక్కువగానే కనిపిస్తోంది. ప్రభుత్వం సామాన్యుల ప్రయోజనాల దృష్ట్యా దిగుమతి సుంకాలపై పునరాలోచన చేయాలి. అలాగే, ప్రజలు కూడా బంగారాన్ని ఆభరణంగానే కాకుండా, క్రమబద్ధమైన పెట్టుబడి సాధనంగా భావించి, ధరలు తగ్గినప్పుడు కొనుగోలు చేసే విజ్ఞతను ప్రదర్శించాలి.



**- సురేశ్‌చంద్ర ప్రొద్దుటూరి**
హైదరాబాద్, ఆర్థిక నిపుణుడు

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.